
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 31 జనవరి 2024 | 5



రేపటి నుంచి బ్యారేజీపై రాకపోకలు బంద్ 7

బాబోయ్ పెద్ద పులి



గోదావరిలో సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్

మహా.. దోపిడీ

గోదారిలో డ్రెడ్జింగ్ కుంభకోణం..

- ఎన్నికల వేళ.. అక్రమాల జోరు
- కోటి 30 లక్షల క్యూబిక్ మీటర్లు డ్రెడ్జింగ్
- రూ. 268 కోట్లతో తవ్వకానికి ఒప్పందం
- నిబంధనలు పట్టించుకోని వైనం
- రాత్రింబవళ్లు తవ్వకాలు
- బ్రిడ్జిల వద్ద తవ్వేస్తున్నారు..
- కన్నెత్తి చూడని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమాలు మరింత పెరిగాయి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో జోరు పెంచారు. ఎక్కడికక్కడ ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.. అందినకాడికి దోచుకునేందుకు తెగబడుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ అనుమతి లేకుండా రాత్రీ పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ సాగుతూనే ఉంది. నిత్యం వందలాది డ్రెడ్జింగ్ పడవలతో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతుంది.మరో పక్క గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందిన సంస్థ పేరుతో డిసెంబర్ నుంచి మరింత డ్రెడ్జింగ్ జరుగుతోంది. ఇదో పెద్ద కుంభకోణమంటూ విమర్శలు వస్తున్నాయి. గత మే నెల నుంచి అనుమతులు లేకుండా ఇరిగేషన్, మైన్స్ అధికారుల నుంచి కూడా కనీస అనుమతులు తీసుకోకుండా జిల్లా శాండ్ కమిటీ నుంచి ఆమోదం పొందినట్టు చెబుతూ.. కనీస ఆధారాలు కూడా చూపకుండా గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచిన సంగతి తెలిసిందే. కొద్దిరోజుల నుంచి ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగారు. కానీ నిబంధనలు పట్టించుకోకుండా డ్రెడ్జింగ్ కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ దోపిడీ ఇలా ఉంటే, అధికారికంగా డ్రెడ్జింగ్ అంటూ మరొకరు రంగంలోకి దిగారు. సుమారు రెండేళ్ల కిందట బ్యారేజీకి ఎగువ నుంచి గామన్ బ్రిడ్జి వరకూ అఖండ గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం, ఇసుక తిప్పలు తొలగించడం కోసం అధికార వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. అప్పట్లో ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు.కానీ మెరిట్ ఉన్నవారిని కాదని..తక్కువ అర్హత ఉన్న కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు భయపడి చాలా రోజులు ఆమోదించలేదు.ఈ సంఘటనతో ఇరిగేషన్ ఎస్ఈ ఒకరు బదిలీ అయ్యారు. పోలవరంలో పనిచేసే మరో ఎస్ఈని ఇక్కడకు రప్పించి ఇన్‌చార్జిగా పెట్టి చాలా కాలం తర్వాత నెమ్మదిగా వారికి నచ్చిన కాంట్రాక్టర్‌కే ఒకే చేయించారు. కానీ ఎం దువల్లనో కాంట్రాక్టర్ చాలా కాలం వదిలేశారు. ఇటీవల రంగంలోకి దిగారు. ఒప్పందం ప్రకారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి గామన్ బ్రిడ్జికి 800 మీటర్ల లోపు వరకూ మొత్తం కోటి 70 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక డ్రెడ్జింగ్ చేయాలి. దీని కోసం క్యూబిక్ మీటరుకు రూ.155 వంతున ప్రభుత్వం సదరు కాంట్రాక్టు సంస్థకు చెల్లించాలి. అంటే మొత్తం రాజమహేంద్రవరం వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.144 కోట్లు, కొవ్వూరు వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.124 కోట్లు కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి ఒప్పందం జరి గింది. ఈ ఒప్పందం ప్రకారం కాంట్రాక్టర్ పెద్ద డ్రెడ్జర్లు పెట్టి ఇసుక తిప్పలు తొలగించి, ఇసుకను గోదావరి ఒడ్డున పోగు పెట్టాలి. దానిని వేరేవాళ్ల చేత ప్రభుత్వం అమ్మించి డబ్బు చేసుకుంటుంది.డ్రెడ్జింగ్ వల్ల గోదావరిలో నీటి నిల్వ శాతం పెరగాలనేది లక్ష్యం. కానీ ఇక్కడ కాంట్రాక్టర్ ఎంత ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారో చెప్పడానికి ఎవరూ కనిపించరు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుక ప్రత్యేకంగా ఎక్కడా పోగులు పెట్టినట్టు లేదు. గతంలో డ్రెడ్జింగ్ చేసి వెంటనే అమ్మేసినట్టే ఇప్పుడూ జరుగుతోంది. అధికారికంగా డ్రెడ్జింగ్ చేసిన కాంట్రాక్టరు ప్రత్యేకంగా ఇసుక పోగు చేసి, ఇరిగేషన్ అధికారులకు కానీ, ఏపీ ఎండీసీకి గానీ అప్పగించాలి.ఇక్కడ ఏమి జరుగుతుందో ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు.గతంలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట వైసీపీ నేతలు నడుపుతున్న ర్యాంపుల్లో కూడా డ్రెడ్జింగ్ సాగుతూనే ఉంది. గాయత్రీ, కోటిలింగాల, కాతేరు, వెంకటనగర్ ర్యాంపులు, కొవ్వూరులో కూడా డ్రెడ్జింగ్ జరుగుతోంది.

బ్రిడ్జిల ప్రక్కనా తవ్వేస్తున్నారు..

వాస్తవంగా గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం డ్రెడ్జింగ్ చేస్తే బ్యారేజీకి మూడు కిలోమీటర్ల వరకూ ఎటువంటి తవ్వకాలు జరగకూడదు. గోదావరి రోడ్డుకమ్ రైలు బ్రిడ్జి వైపు అప్‌స్ట్రీమ్‌లో ఎగువ వైపు 500 మీటర్లు, దిగువ ప్రాంతంలో 300 మీటర్ల వరకూ డ్రెడ్జింగ్ చేయ కూడదు. ఇసుక తవ్వకాలు జరగకూడదు. ఇది నిబంధన. అంతేకాక గతంలో నిపుణుల కమిటీ కూడా ఇక్కడ ఇసుక తవ్వితే బ్రిడ్జిలకు ప్రమాదమని హెచ్చరించిన సంగతి తెలిసిందే.కానీ ఎక్కడా నిబంధనలు పాటించడంలేదు. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. రాత్రీ పగలూ ఒకటే పని. ఇది ఏ ప్రమాదానికి దారితీస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పైగా డ్రెడ్జింగ్ ఒక పద్ధతి ప్రకారం జర గాలి. పెద్ద డ్రెడ్జర్లతో పని జరగాలి. ఇవాళ వంద వరకూ డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వేస్తున్నారు.


గామన్ బ్రిడ్జి అవతలా ఇంతే..

ప్రభుత్వం ఒప్పందం పొందిన కాంట్రాక్టు సంస్థ ఇసుక తవ్వినా గామన్ బ్రిడ్జి అవతల అనుమతి లేదు. కానీ కాతేరు, వెంకటనగర్, తాళ్లపూడి వైపు ఇష్టాను సారం తవ్వేస్తున్నారు. గామన్ బ్రిడ్జికి ఇవతల 800 మీటర్ల వరకూ తవ్వకూడదనే నిబంధన ఉంటే సమీ పంలోనే తవ్వేస్తున్నారు.అయినా ఎవరూ పట్టించుకోవ డంలేదు. అధి కారులెవరూ నోరుమెదపడంలేదు. ఎన్ని కల ముందు దోచు కున్నంత దోచేసుకోవడం కోసమే ఈ రకమైన అక్రమాల జోరు పెంచినట్టు అర్థమవుతోంది.

మళ్లీ ఉచిత ఇసుక విధానం

చంద్రబాబు ప్రకటనతో ప్రజల్లో జోష్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



వైసీపీ ప్రభుత్వం ఇసుక ధరలు పెంచడమే కాకుండా, ఇష్టానుసారం దోపిడీ చేస్తున్న సంగతి తెలిసిందే. కానీ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాతేరులో సోమవారం జరిగిన రా కదలిరా భారీ బహిరంగ సభలో మాట్లా డుతూ మళ్లీ ఉచిత ఇసుక విధానం తీసుకొస్తామని ప్రకటించారు.అంతే కాక ఇక్కడ ఇసుక దోపిడీ చేస్తున్న వారిపై విచారణ చేసి చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ బాధ్యతను టీడీపీ- జనసేన ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో అన్ని వర్గాల్లోనూ ఆశలు పెరిగాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లు, బిల్డర్లు, భవన నిర్మాణ కార్మికులకు ప్రాణం లేచివచ్చినట్టయ్యింది. ఇంతవరకూ ఇసుక అక్రమాలతో పాటు ఇసుక ధరలు విపరీతంగా పెరగడం, అవసరమైన సమయాల్లో అందుబాటులో లేకపోవడంతో అన్ని వర్గాలు ఇబ్బందులు పడిన సంగతి తెలిసిందే. చాలా మంది తమ ఇళ్ల నిర్మాణాలు వాయిదా వేసుకున్నారు.ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని చేసిన ప్రకటన అన్ని వర్గాల్లోనూ జోష్‌ను పెంచింది. 2019 వరకూ కూడా చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసిన సంగతి తెలిసిందే.

'యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 30 : యానిమేటర్లకు ఉద్యోగభద్రత కల్పించకపోతే సమ్మెలోకి వెళ్లక తప్పదని ఆంధ్రప్రదేశ్ ఆర్‌పీలు, యానిమేటర్ల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల కాలపరిమితి విధించి యానిమేటర్లను తొలగించడం అన్యాయమన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ యానిమేటర్లను తొలగించాలనుకోవడం అన్యాయమన్నారు.సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వరలక్ష్మీ, కోశాధికారి కనక, జిల్లా నాయకురాలు లలిత, ఈశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు నన్నయ స్నాతకోత్సవం 7

- ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- సుధామూర్తికి డాక్టరేట్ ప్రదానం

ఈ ప్రమాదాలకు బాధ్యులెవరు?

గతేడాది జూలై 26న తుని మండలం చేపూరు జంక్షను వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న భర్త,భార్య, కుమారుడిని లారీ ఢీకొన్న ఘటనలో తల్లీ, కొడుకు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. జంక్షనుకు మూడు కిలో మీటర్ల ముందు నుంచీ రోడ్డు డౌన్‌గా ఉంటుంది. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టింగ్ స్టడ్స్, సిగ్నల్స్ వంటివేమీ ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికు లు మండిపడుతున్నారు.అదే నెల 27న గోపాలపురం మండ లం కరిచర్లగూడెం వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలు విడిచారు.

అధికారుల నిర్లక్ష్యం..

బొమ్మూరు సమీపంలోని హార్లిక్స్ ఫ్యాక్టరీ దాటిన తర్వాత భూలోకమ్మ గుడి దగ్గర ధవళేశ్వరం వైపు వెళ్లడానికి రోడ్డు ఉంటుంది. ఆ రోడ్డు ప్రారంభం నుంచి మరో రహదారి కుడివైపునకు వెళుతుంది.ఈ రెండూ బాగా డౌన్‌గా ఉంటాయి.దీంతో యూటర్న్ తీసుకునే సమయంలో, ధవళేశ్వరంవైపు తిరిగే సమ యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు.ఎస్పీ జగదీశ్ స్వయంగా వెళ్లి పరిశీలించారు.ఆ రోడ్డును అక్కడ తొలగించి..కొద్ది మీటర్ల దూరం లో ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు లేఖ రాశారు. కార్యాచరణ మాత్రం దారిలో ఉంది.

వాహనదారులకు పరీక్ష..

సాక్షాత్తూ ఎస్పీ కార్యాలయం సమీపంలో డీటీసీ సెం టర్‌ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఈ జంక్షనులో హైవేకు ఏకంగా మూడు సర్వీసు రోడ్లు, నగరం నుంచి వెళ్లే రహదారి, శ్రీరాంపురం వైపు వెళ్లే రోడ్డు మొత్తం ఐదు రహదారులు కలుస్తాయి.అందువల్ల ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. కానీ ఇక్కడ కనీసం సరిపడా లైటింగ్ లేదు. కనీసం సిగ్నల్స్ పని చేయవు. వాహనాదారులు తమ ప్రాణాలకు పరీక్ష పెడుతూ ముందుకు కదలాల్సిందే.



ఈ నెల 2న దేవరపల్లి వద్ద జరిగిన ప్రమాదం

రోడ్లపై.. ప్రాణాలు!

రహదారుల.. రక్త చరిత్ర

- రోజూ ప్రాణాలను మింగేస్తున్న రోడ్లు
- బ్లాక్ స్పాట్లపై నిలువెత్తు నిర్లక్ష్యం
- జిల్లావ్యాప్తంగా 35 గుర్తింపు
- శాఖల మధ్య సమన్వయ లోపం
- లేఖలతో సరిపెడుతున్న అధికారులు
- గతేడాది 350 మంది పైనే మృతి
- మాసోత్సవాలతో ఒరిగేదేంటి?
- బ్లాక్ స్పాట్ల వద్ద చర్యలకు డిమాండ్

రహదారి భద్రత మాసోత్సవాలు.. ప్రతి పాఠశాలకు వెళ్లి అధికారులు చాలా గొప్పగా చెబుతున్నారు.. అయితే చేయాల్సింది చేయకుండా ఏం చెబితే ఏం లాభం.. రోడ్డుపైకి వెళితే ఇంటికి వచ్చే వరకూ టెన్షనే.. ప్రస్తుతం పరిస్థితి అంత ప్రమాదకరంగా మారింది.. ఎందుకంటే ప్రమాదాలు ఆ స్థాయిలో పెరిగిపోయాయి.. మూడు నెలల కిందట ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా 35 బ్లాక్ స్పాట్లను గుర్తించారు.. నేటికీ ప్రమాదాల నివారణకు అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం.. దీంతో ఎందుకీ ఉత్తుత్తి రహదారి భద్రత మాసోత్సవాలు అంటూ జనం మండిపడుతున్నారు. ముందు రహదారి భద్రత చర్యలు చేపట్టి తరువాత మాసోత్సవాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'భాండశుద్ధిలేని పాకమేల? చిత్తశుద్ధి లేని శివపూజలేలరా? విశ్వదాభి రామ వినురవేమా'- వేమన. ఈ అద్భుతమైన మాటలు రహదారి భద్రతలో యంత్రాంగం చూపిస్తున్న నిబద్ధతకు సరిగ్గా సరిపోతాయేమో! రహదారి భద్రత కరువై వందలాది ప్రాణాలను రోడ్లు మింగేస్తున్నాయి. రోడ్డుపైకి వెళ్లే వాహనం క్షేమంగా ఇంటికి చేరుతుందనే గ్యారంటీ కరువైంది. ఇల్లు చేరడానికి కొంచెం ఆలస్యమైతే ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని ఇంట్లో వాళ్లు బెంబేలెత్తిపోతున్నారు. రక్తం మరిగిన రహదారుల కోరలు విరచాల్సిన యంత్రాంగం సమన్వయలోపంతో కొట్టుమిట్టాతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ, మునిసిపాలిటీ, రవాణా, విద్యుత్, పోలీస్ వెరసి ప్రభుత్వం.. నిర్లక్ష్యం ఎవరి దైనా రోడ్లకు నిండు ప్రాణాలు బలై కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. అధికారులు లేఖలతో సరిపెడు తుండగా బ్లాక్ స్పాట్ల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. ఇప్పటికే గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా(ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశం)ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లోనూ అలసత్వం కనిపిస్తోంది.జిల్లాలో గతేడాది రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం చెందిన వారి సంఖ్య 350 దాటిపో యింది. బ్లాక్ స్పాట్ల సంఖ్య తగ్గించడానికి ప్రయత్నాలు ఎంత వరకూ జరుగుతున్నాయో గానీ ఆ సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకూ నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల వల్ల ఉపయోగం ఎంత ఉంటుందో వేచి చూడాల్సిందే.

మృత్యుకుహరాల్లా జాతీయ రహదారులు

జిల్లాలోని మునిసిపాలిటీ, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిలో జాతీయ రహదారులు మృత్యుకుహరాల్లా మారిపోయాయి. ఎన్‌హెచ్ఏఐ ప్రతీ పనికీ కాంట్రాక్టులపై ఆధారపడడంతో తగిన ఫలితాలు సాధించలేకపోతున్నామనే విమర్శలున్నాయి.జిల్లాలో గుర్తించిన 35 బ్లాక్‌స్పాట్లలో జాతీయ రహదారిపై 28 ఉండగా, స్టేట్ హైవేలపై 5, ఇతర రోడ్లపై 2 ఉన్నాయి. ఎన్‌హెచ్ 16(ఏ), 16, 516(ఈ), 365బీబీ, 516డీ, ఆర్ అండ్ బీ రోడ్లపై గతేడాది 700 వరకూ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 336 మంది ప్రాణాలు బలైపోయాయి. ఒకసారి బ్లాక్‌స్పాట్‌గా కేంద్ర ప్రభుత్వ రహదారుల మంత్రిత్వ శాఖ వద్ద రిజిస్టరు కాగానే రూ.25లక్షలు మంజూరవుతాయి. వాటితో బ్లాక్‌స్పాట్లు, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల్లో ప్రమాద నివారణా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాల్సి ఉంటుంది.ఆ సమన్వయం కొరవడడంతో బ్లాక్‌స్పాట్లలో సైతం జాగ్రత్త చర్యలను మమ అనిపిస్తున్నారు. ఇక ఆర్ అండ్‌బీ పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. నిధుల లేమితో కొట్టు మిట్టాడుతుండడంతో ఏదోకటి చేసి అయిందనిపిస్తున్నారు.

బ్లాక్‌స్పాట్లలో ఏం చేయాలి

కొద్ది దూరంలో బ్లాక్‌స్పాట్ ఉందనే హెచ్చరిక బోర్డు. రిఫ్లెక్టింగ్ స్టడ్స్(క్యాట్ఐస్), థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్స్, డౌన్ సర్వీసు రోడ్లలో రిఫ్లెక్టింగ్ కాన్వెక్స్ అద్దాలు, రంబుల్ స్ట్రిప్స్, సరిపడా లైటింగ్, జిగ్‌జాగ్‌గా స్టాపర్ బోర్డులు, ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సబ్ కంట్రోళ్లు, సర్వీసు రోడ్లలో స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలను పటిష్టం చేయాలి. సిబ్బందిని నిఘా ఉంచి తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి. వాస్తవానికి నిబంధనల ప్రకారం అంచనా వేసి ఒక ప్రదేశాన్ని పోలీసులు బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తారు. అక్కడ జాగ్రత్త చర్యలు తీసుకోడానికి ఆ శాఖ వద్ద నిధులు ఉండవు. పోలీసు సిబ్బందిని కాపలా పెట్టడానికి సిబ్బంది కొరత ఇప్పటికే విపరీతంగా వేధిస్తోంది. ఇక.. రోడ్డు మార్జిన్లు, మార్కింగ్స్, రిఫ్లెక్టింగ్ కాన్వెక్స్ మిర్రర్స్ వంటివి ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలి. వాటి నిమిత్తం వారి వద్ద నిధులు ఉంటాయి. కానీ, ఎందుకో ముందస్తు జాగ్రత్తలపై పెద్దగా దృష్టి సారిస్తున్నట్టు కనిపించడం లేదు. రాజమహేంద్రవరంలో కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్‌నీ సరిగా నిర్వహించలేని దుస్థితి వేధిస్తోంది.

ఇలా చేస్తే బెటర్...

జాతీయ రహదారులు లేదా రెండు లేన్లు, సింగిల్ లేన్ (వరుస) రోడ్లపై స్పీడుగా వెళ్లే, నింపాదిగా వెళ్లే, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు, కార్లు ఏవి ఏ లేనులో వెళ్లాలో ఇప్పటికీ అధిక శాతం మంది వాహనదారులకు అవగాహన లేదు. దీనిపై విస్తృతంగా చైతన్యం తేవాల్సిన అవసరం ఉంది. టోల్‌గేట్ల వద్ద ఫోన్ నంబరు తీసుకొని సదరు వాహనదారుడిని అప్రమత్తం చేసే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణపై మెసేజ్‌లను పంపొచ్చు. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించవచ్చు. అతి వేగంగా వెళ్లే వాళ్లను గుర్తించి కౌన్సెలింగ్ చేయడం, అవసర మైతే కేసులు నమోదు చేయడం చేయవచ్చు. రోడ్లపై ఇష్టాను సారం పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించ వచ్చు. రోడ్ల పక్కన ప్రమాద నివారణ సూచన, హెచ్చరిక బోర్డులను విస్తృతంగా ఏర్పాటు చేయవచ్చు.రాత్రి వేళల్లో అక్కడక్కడా ఆకస్మిక తనిఖీలు చేసి లారీలు, బస్సుల వంటి భారీ వాహనాల డ్రైవర్ల పరిస్థితిని అంచనా వేయవ చ్చు.వారి ముఖాలను నీటితో కడిగించి పంపించవచ్చు. ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావిస్తే వాహనం కాసేపు పక్కకు నిలపాలని ఆదేశించవచ్చు.అయితే పోలీసు శాఖకు ఇలాంటివి వీలుపడకపోవడం గమనార్హం.

ప్రమాదాలకు కేరాఫ్ దేవరపల్లి

జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషను పరిధిలో రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. జాతీయ రహదారుల పరిధి ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు రోడ్డు ప్రమాదాల కేసుల నమోదు,దర్యాప్తు, విచారణలు ప్రహసనంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ గణాంకాలు పరిశీలిస్తే 25 పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ప్రమాదాలు నమోదయ్యాయి. రోడ్ల ప్రమాదాల కేసుల్లో దేవరపల్లి మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానాల్లో వరుసగా బొమ్మూరు, రాజానగరం, టూటౌన్ (రాజమహేంద్రవరం), పెరవలి ఉన్నాయి. మృత్యువాత పడిన కేసుల్లో కూడా దేవరపల్లి(40) మొదటి స్థానంలో ఉంది. తర్వాత వరుసగా రాజానగరం (25), బొమ్మూరు(23), నల్లజర్ల(19), టూటౌన్, గోకవరం, రంగంపేట, కొవ్వూరుటౌన్, గోపాలపురంలో 14 మంది చొప్పున ప్రాణాలు విడిచారు.





ఆందోళన చేస్తున్న బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో కంపెనీ కార్మికులు

లే ఆఫ్ ఎత్తివేయాలి

బిక్కవోలు, జనవరి 30: బలభద్రపురం శివారు కానేడులో ఉన్న బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రకటించిన లేఆఫ్‌ను వెంటనే ఎత్తివేసి ఫ్యాక్టరీని తెరవాలని కార్మికులు డిమాండ్ చేశారు. బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతేడాది నవంబరు 28న చట్టవిరుద్ధంగా యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి ఉత్పత్తి నిలుపుదల చేసిందన్నారు. ఈ విషయాన్ని డీసీఎల్‌కు ఫిర్యాదు చేయగా యాజమాన్యంతో కార్మికులతో చర్చించి పరిశ్రమను యథావిధిగా నడపమని ఆదేశించారన్నారు.పరిశ్రమ తెరచి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

జావగార్చేశారు!



తాళ్లపూడి, జనవరి 30 : ప్రభుత్వ పథకం జావ గారిపోతోంది. అయినా పట్టించుకునేవారే లేరు. తాళ్లపూడి మండలం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పంపిణీ చేసే రాగి జావ పురుగులు మయంగా ఉంది.ప్రభుత్వం ఈ నెల వారం రోజుల్లో ఎక్స్‌పైరీ అయిపోయే నిల్వ రాగి పిండిని పండుగ ముందు కొన్ని పాఠశాలలకు సరఫరా చేసింది. సంక్రాంతి సెలవులు తరువాత పిల్లలకు రాగి జావ ఇద్దామని చూస్తే పిండిలో పురుగులు కనిపించాయి. పాకెట్ల మీద జనవరి 15తో గడువు ముగిసి ఉండడంతో పంపిణీకి సాహసం చేయలేదు. దీనికి తోడు జిల్లా అధికారుల నుంచి రాగి జావ స్టాక్‌లో చూపవద్దని సూచించినట్టు సమాచారం సరఫరా చేస్తున్న వస్తువులు బాగుండకపోయినా వాటిని హెచ్ఎంలు తీసుకుని డంప్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిం పులు జరిగిపోతున్నాయి..పరోక్షంగా ప్రభుత్వ నిధులకు గండి పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ పథకం పేరు చెప్పి...

లింక్ క్లిక్ చేయమని డబ్బులు కొట్టేశాడు..



కమిషనర్ శ్రీకాంత్, చైర్‌పర్సన్ రత్నకుమారికి ఫిర్యాదు చేస్తున్న దేగల రామకృష్ణ

కొవ్వూరు, జనవరి 30 : ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో నమ్మించి ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాను ఖాళీ చేసిన ఘటన ఇది.. కొవ్వూ రు 2వ వార్డులో వలంటీరు మాణిక్యంకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2-45 గం టలకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. నేను రాజధాని అమరావతి నుంచి మాట్లాడుతున్నాను. మీ క్లస్టర్ పరిధిలో ప్రభుత్వ పథకాలు ఆగిపోయిన వారు ఎవరైనా ఉన్నారా అని అడిగాడు. వెంటనే ఆ వలంటీరు పట్టణానికి చెందిన దేగల రామకృష్ణ ఫోన్ నెంబరుకు కాన్ఫరెన్సు కలి పాడు.దీంతో ఆ అపరిచిత వ్యక్తి రామకృష్ణను మీకు పథకాలు ఎందుకు రావడం లేదని అడిగాడు. 1000 ఎస్ఎఫ్‌టీలో ఇల్లు ఉండడంతో పథకాలు ఇవ్వడం లేదని వాపోయాడు. మీకు వాహనమిత్ర రాదు.. కాపునేస్తం వేస్తున్నాను మీ ఫోన్ లింక్ పంపించానని.. ఆ లింక్ ఓపెన్‌చేయమని అవతలి వ్యక్తి తెలిపాడు.. లింక్ ఓపెన్ చేసిన వెంటనే రామకృష్ణ బ్యాంకు ఖాతా నుంచి మొదటగా రూ.15 వేలు దొంగిలించడానికి ప్రయత్నించగా ఖాతాలో అంత సొమ్ము లేకపోవడంతో ఫెయిలైంది. ఆ తరువాత మళ్లీ ప్రయత్నించి రూ.6వేలు దొంగిలించాడని రామకృష్ణ మంగళవారం కమిషనర్ బి.శ్రీకాంత్, చైర్‌పర్సన్ బావన రత్నకుమారికి ఫిర్యాదు చేశారు.


అలుమ్నీ ఆడిటోరియం లాన్‌లో స్నాతకోత్సవ ఏర్పాట్లుచేస్తున్న దృశ్యం

నేడు జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవం

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్
- పలువురికి పీహెచ్‌డీ, డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం
- ఏర్పాట్లు పూర్తి ● స్నాతకోత్సవానికి రిహార్సల్స్
- ఉదయం 10.30 నుంచి ఆరంభం

జేఎన్టీయూకే, జనవరి 30: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవంను బుధవారం ఉదయం 10.30నుంచి అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబందించి వర్శిటీలోని వీసీ సమావేశ హాల్లో మంగళవారం డీఏఏ, పీఆర్వో ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ పాల్గొని స్నాతకోత్సవ నిర్వహణ వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు, 64 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు 28 బంగారు, ఎండోమెంట్ పతకాలు ప్రదానంచేస్తారన్నారు. అదేవిధంగా బీటెక్ 34,199, బీఫార్మసీ 1477, ఎంటెక్ 1689, ఎంబీఏ 1093, ఎంసీఏ 343, ఎంఫార్మసీ 332, బీబీఏ 21, ఫార్మాడీ 182, బీఆర్క్ 13మంది విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవానికి కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగానూ, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక అతిథిగానూ పాల్గొంటారని తెలిపారు. టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు వర్శిటీ తరపున గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవ వేడుకలకు పాలకమండలి సభ్యులు, మాజీ ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఉన్నతవిద్యాశాఖాధికారులు వర్శిటీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పూర్వవిద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వీసీ తెలిపారు. సాయంత్రం స్నాతకోత్సవం రిహార్సల్స్‌ను వీసీ అధ్యక్షతన నిర్వహించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎస్వీ శేషాచారి



జేఎన్టీయూకే, జనవరి 30: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి కాకినాడలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నప్పుడు యూనివర్శిటీ ఎంట్రీ స్కీమ్ కింద ఇండియన్ నేవీలోని ఎలక్ట్రికల్ విభాగంలో నియమితులయ్యారు. ఐఎన్ఎస్ రాణా, రణవీర్ సబ్‌మెరైన్‌లలో సేవలందించి ఐఎన్ఎస్ కళింగట్ విశాఖపట్నం క్షిపణి స్థాపనలో ముఖ్యపాత్ర పోషించారు. అంతేకాకుండా ఆయన నౌకలు, జలాంతర్గాములు రెండింటికీ అనేక పరికరాలు, వ్యవస్థల స్వదేశీకరణలో కీలకపాత్ర పోషించారు. రష్యాలోని పోటీబ్లాక్ సీ పోర్టులో ఎక్విప్‌మెంట్ ఓరియంటెడ్ కోర్సు, సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు, న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాలలో ఎన్‌డీసీ కోర్సు పూర్తిచేశారు. నేవీలో ఆయన అందించిన సేవలకుగానూ భారత ప్రభుత్వం విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. మజగాన్ డాక్‌లిమిటెడ్(ఎండీఎల్)లో షిప్ డైరెక్టరుగా ఎంపికైన తరువాత 22 మార్చి 2007లో రియర్ అడ్మిరల్ హోదాలో ఇండియన్ నేవీ నుంచి తాత్కాలిక పదవీ విరమణ చేశారు. అణు జలాంతర్గాములు, నౌకాదళ నౌకలకోసం వివిధ పరికరాలు, వ్యవస్థలను రూపొందించడంలో వెంకటశేషాచారి కీలకపాత్ర పోషించారు.

ఆయనొక బహుముఖ ప్రజ్ఞాశాలి

- టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్నకు జేఎన్టీయూకే గౌరవ డాక్టరేట్



జేఎన్టీయూకే, జనవరి 30: రేపు నిర్వహించనున్న కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవానికి గౌరవ డాక్టరేట్ అందుకునేందుకు విచ్చేయు చున్న టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్,సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన 30ఏళ్ల నుంచి విద్యావ్యవస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలలో తనదైన శైలిలో ముద్రవేశారు. మానవ వనరులు, సేల్స్ పరిశోధనాభివృద్ధి, విద్య మార్కెటింగ్ తదితర అంశాలలో అమెరికా, చైనా, తైవాన్, సింగపూర్ దేశాలు ఆయన సాంకేతిక అనుభవాన్ని వినియోగించుకుంటున్నాయి. రాజన్న ప్రస్తుతం టీసీఎస్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గానూ గ్లోబల్ హెడ్ ఆఫ్ ద కమ్యూనికేషన్స్, మీడి యా, టెక్నాలజీ గ్రూపులకు తన సేవలను అందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్‌లోని టీసీఎస్ ప్రపంచస్థాయిలో 3వ స్థానం సంపాదించడంతో పాటూ 4500 ఉద్యోగాల నుంచి 90 వేల ఉద్యోగాలను టీసీఎస్ కల్పించింది. జేఎన్టీయూకేతో పాటూ పలు అనుబంధ కళాశాలలకు బీఓఎస్ సభ్యునిగా వ్యవహరించి పైథాన్, వెబ్‌టెక్నాలజీ, మొబైల్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్‌టెక్నాలజీలలో సిలబస్ రూపకల్పనకు కృషిచేశారు.

● సాధించిన అవార్డులు

ఐటీ పరిశ్రలకు రాజన్న అందించిన సేవలను గుర్తించి గవర్నమెంట్ ఆఫ్ జిజియాంగ్‌వెస్ట్ లేక్ ఫ్రెంచ్ షిప్ అవార్డును అందించారు. అదేవిధంగా 2007లో ఐటీ ప్రొఫెషనల్ ఆఫ్‌ది ఇయర్‌గా అవార్డును హెచ్‌ఎంఏ అందించింది. 2012లో నాయుడమ్మ పురస్కారాన్ని ఏపీ ప్రభుత్వం ప్రధానం చేసింది. 2016లో ఎన్ఐటీ వరంగల్ నుంచి విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డును, 2019లో విజ్ఞాన్ వర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను అందించింది. అంతేకాకుండా హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (హెచ్‌ఎంఏ) ఆయనకు 2023లో లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారాన్ని అందించింది.

'నన్నయ'లో నేడు పట్టాల పండుగ

- స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌కు గౌరవ డాక్టరేట్

దివాన్‌చెరువు, జనవరి 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విచ్చేసి పట్టాల ప్రదానం చేస్తారని వీసీ పద్మరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరై ప్రసంగిస్తారని, విశ్వ విద్యాలయం తరపున ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. అతిథులుగా ఉన్నత విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి జె.శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తదితరులు విచ్చేయనున్నారని చెప్పారు. పట్టాలు స్వీకరించే వారు సూచించిన నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు

స్నాతకోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను వీసీ పద్మరాజు, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితర జిల్లా అధికారులు మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని, గవర్నర్ కోసం సిద్ధంచేసిన అతిథి గృహాన్ని పరి శీలించి ట్రైల్ రన్ నిర్వహించారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న నన్నయ వీసీ, జిల్లా అధికార్లు

నేడు గవర్నర్ పర్యటన ఇలా..

దివాన్‌చెరువు, జనవరి 30: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.45గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.05 గంటలకు గైట్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన అతిథిగృహానికి చేరుకుని విరామం తీసుకుంటారు. తదుపరి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.35వరకూ నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్స వంలో పాల్గొంటారు. ఆ తరువాత గైట్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరు కుని సా.4.55గంటలకు హెలికాఫ్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి బయ లుదేరి వెళతారు. అక్కడ నుంచి విజయవాడ రాజభవన్‌కు చేరుకుంటారు.

అంతర్వేది ఉత్సవాలు

వైభవంగా నిర్వహించాలి

- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో కేశవర్ధనరెడ్డి


తెప్పోత్సవం నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, జనవరి 30: బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 16నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి అన్నారు. మంగళవారం తీర్థ మహోత్సవ ఏర్పాట్లపై ముందుగా ఆలయ చైర్మన్ క్యాబిన్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఉత్సవ ఏర్పాట్లలో అధికారులందరూ తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి ఈ ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. కల్యాణ మండపం, రథం, చక్రస్నానం, తెప్పోత్సవం ప్రదేశాలను పోలీసు, ఆలయ అధికారులతో ఆర్డీవో మంగళవారం పరిశీలించారు. ఎలక్ట్రికల్ వర్క్స్, పందిర్లు, క్యూలైన్లు, బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించి అనంతరం తెప్పోత్సవం నిర్వహించే మంచినీటి చెరువు పనులు జరుగుతున్న కారణంగా గోదావరిలో లేక అదే మంచినీటి చెరువులో నిర్వహించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాజోలు సీఐ గోవిందరాజు, సఖినేటిపల్లి ఎస్ఐ ఎస్.రాము, తహసీల్దార్ రమాకుమారి, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 10 వరకూ

కాటన్ బ్యారేజీపై రాకపోకలు బంద్

రాజమహేంద్రవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి/ఆత్రేయపురం: ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి రోడ్డు మరమ్మతు పనులు వేగంగా చేయడం కోసం ఫిబ్రవరి 1నుంచి 10వతేదీ వరకూ ఈబ్యారేజీని మూసివేసి, రాకపోకలు బంద్ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రూ.2కోట్లతో ఈపనులు చేపట్టారని, త్వరగా పూర్తవ్వడానికి వీలుగా వాహనాల రాకపోకలు ఆపుతున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికార్లను ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్ బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలన్నారు. కొన్నేళ్లుగా బ్యారేజీ ఛిద్రమై అస్తవ్యస్తంగా మారింది. బ్యారేజీని పటిష్టపరచాలని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళన సైతం నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు బ్యారేజీ, రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో బ్యారేజీపై తారు పొరలను తొలగించి గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బుధవారం నుంచి పది రోజులపాటు వాహనాల రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్టు బ్యారేజీ డీఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.


ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక బ్యారేజీ వద్ద జరుగుతున్న పనులు

అన్నవరంలో నూతన అన్నదాన

భవనం నిర్మాణానికి ప్రణాళిక!

అన్నవరం, జనవరి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి 2016 నుంచి ఎదురుచూస్తున్న ప్రసాద్ స్కీం నిధులు అతిత్వరలో విడుదలకానున్నాయి. రూ.10కోట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. దీనిపై దేవస్థానానికి అధికారికంగా సమాచారం రాకపోయినా రాష్ట్ర టూరిజం శాఖకు కేంద్ర టూరిజంద్వారా సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ నిధులతో అన్నదానభవనం నిర్మించాలని దేవస్థానం అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం దేవదాయశాఖ డిప్యూటీ స్థపతి శ్రీనివాస ఆచారి సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి అన్నదానభవనం ఎక్కడ ఏర్పాటుచేయాలనే దానిపై పరిశీలన చేశారు. టీటీడీ సత్రం తొలగించిన ప్రాంగణాన్ని ఆయన దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. రెండు మూడ్రోజులలో అధికారిక సమాచారం వచ్చిన వెంటనే కాకినాడ ఎంపీతో చర్చించి స్థలపరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు. దేవస్థానానికి చేయించే రథాలను డిప్యూటీ స్థపతి మంగళవారం పరిశీలించారు.

సత్యదేవుడిని దర్శించుకున్న

సినీ రచయిత జె.కె.భారవి


సత్యదేవుడి దర్శనానంతరం సినీ రచయత జె.కె భారవి

అన్నవరం, జనవరి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం ఆధ్యాత్మిక చిత్రాలైన అన్నమయ్య, శ్రీ రామదాసు, మంజునాథ వంటి చిత్రాలకు రచయితగా పనిచేసిన జె.కె.భారవి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడి దుర్మరణం

- నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

యానాం, జనవరి 30: యానాం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి స్విమ్మింగ్‌పూల్లో పడి మృతి చెందిన సంఘటన యానాంలో చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అనంతరం ఆడుకునేందుకు వెళ్లిన విద్యార్థి విగతజీవిగా పడి ఉండటంతో బంధువులు, విద్యార్థులు ఆందోళనకు గురయ్యా రు. స్థానిక అగ్రహారానికి చెందిన సూరిమిల్లి రాజు, శ్యామల దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు సూరిమిల్లి సాయిరోహిత్ (7) స్థానిక శ్రీకృష్ణదేవరాయ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేసిన తరువాత పలువురు విద్యార్థులతో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్‌పూల్లో ప్రమాదవశాత్తూ జారీ పడిపోయాడు. ఆ సమయంలో తోటి స్నేహితులు తప్ప ఎవ్వరూ లేకపోవడంతో కొంత సమయం గడచిపోయింది. అనంతరం అక్కడ ఉన్న విద్యార్థులు వీరిని చూసి తక్షణం స్విమ్మింగ్‌పూల్‌లో ఉన్న బాలుడిని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహం వద్ద తల్లి, బంధువులు బోరున విలపించారు. స్విమ్మింగ్‌పూల్ వద్ద సెక్యూరిటీగార్డు, రక్షణచర్యలు లేకపోవడంతోనే తన కుమారుడు మృతి చెందాడని మృతిని బం ధువులు, స్థానిక గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానాం పరిపాలనాధికారి కార్యాలయం ఎదు రుగా ఆందోళన చేశారు. బాలుడి కుటుంబానికి న్యా యం చేయాలని, సంఘటనలో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆందోళన చేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పరిపాలనాధికారి మునిస్వామి ఆసుపత్రిలో బాలుడి మృతదేహన్ని, సంఘటన జరిగిన స్విమ్మింగ్‌పూల్ ప్రాంతాలను పరిశీలించి ఆందోళన చేస్తున్న ఆందోళనకారులతో మాట్లాడారు. బాలుడి కు టుంబానికి న్యాయం జరిగేలా, నిర్వాహకులపై చర్యలుతీసుకునేలా చర్చిస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. ఈ సంఘటనపై యానాం సర్కిల్ ఇన్ స్పెక్టర్ షణ్ముగం నేతృత్వంలో యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాలుడి మృతదేహం పరిశీలిస్తున్న మునిస్వామి,ఇన్‌సెట్‌లో సాయిరోహిత్


ఆర్‌ఏ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

తండ్రీకొడుకుల బతుకు బండి ఆగింది!

- ఆగి ఉన్న మార్కెట్ లారీని ఢీకొన్న టిప్పర్ లారీ
- మరమ్మతులు చేసుకుంటున్న తండ్రీ కొడుకులు మృతి

రావులపాలెం, జనవరి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి కొత్త వంతెన దిగువున జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని టిప్పర్ లారీ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పాఠకులకు తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం మందపాడుకు చెందిన లారీ డ్రైవర్ పేపెటి శ్రీనివాసరావు (48) అతని కుమారుడు నాగసత్యసాయి (26) ఆకివీడు నుంచి చేపల లోడు వేసుకుని లారీలో వెస్ట్‌బెంగాల్ వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో విశాఖపట్నంలో తవుడు లోడు చేసుకుని ఆకివీడు బయల్దేరారు. సోమవారం అర్ధరాత్రి రావులపాలెం గౌతమి కొత్తవంతెన దిగువన ప్రభుత్వ కళాశాలల సమీపంలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీ మరమ్మతులకు గురైంది. లారీ డ్రైవర్, క్లీనర్ కిందకు దిగి మరమ్మతులు చేసుకుంటున్నారు. కాగా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకకు చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ జిత్తుక రవికుమార్, క్లీనర్ ఎల్లే మణికుమార్ (వీరు బావ, బావమరుదులు) రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు గ్రావెల్ లోడుతో మితిమీరిన వేగంతో వచ్చి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టారు. దీంతో లారీ వద్ద మరమ్మతులు చేసుకుంటున్న తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమయంలో టిప్పర్ లారీ క్యాబిన్ ఆగి ఉన్న లారీలోకి దూసుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఆ సమయంలో తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని రెండు క్రేన్ల సాయంతో సుమారు మూడు గంటలపాటు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రగాయాలపాలైన డ్రైవర్, క్లీనర్లను బయటకు తీశారు. క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువు పి.వెంకటకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్ మంగళవారం తెలిపారు.


గౌతమి వంతెన సమీపంలో జరిగిన ప్రమాదంలో టిప్పర్ లారీ ఢీకొనడంతో మార్కెట్ లారీ కిందపడి మృతి చెందిన డ్రైవర్,క్లీనర్


రోడ్డు ప్రమాదంలో ముందు ఆగిన ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న టిప్పర్ లారీ

బాబోయ్ పెద్ద పులి!


అయ్యవరం-దూబచర్ల మధ్య అయిల్ ఫాం తోటలో పులి సంచరించే ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

- రామశింగవరంలో దూడను చంపిన వైనం
- ట్రాప్ కెమెరాల ఫలితం శూన్యం
- తూతూ మంత్రంగానే గాలింపు చర్యలు
- పొలం పనులకు వెళ్లేందుకు వణికిపోతున్న కూలీలు, రైతులు

నల్లజర్ల, జనవరి 30: ఐదు రోజులుగా పెద్ద పులి ప్రజలకు, అధికారులకు కంటి మీద కునుక లేకుండా చేస్తోంది. ప్రజలు, మూగ జీవుల ప్రాణాలకు రక్షణ కరువైయింది. పులి నల్లజర్ల మండల శివారు ద్వారకాతిరుమల మండలం రామశింగవరం గ్రామంలో ఓ దూడను మంగళవారం ఉదయం చంపి సమీపంలో ఉన్న అడవిలోకి ఈడ్చుకెళ్లి మాంసం తినేసింది. సోమవారం పుల్లలపాడు ఫారెస్ట్ నుంచి నేరుగా చీపురుగూడెం ఫారెస్ట్ మీదుగా చాదరాశికుంట-రామశింగవరం వెళ్లినట్టు పాదముద్రలను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు.

అధికారులు స్పందించడం లేదు

పెద్ద పులి కనిపించిందని గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించడం లేదని పలు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులి వచ్చిన 5,6 గంటలకు వచ్చి తూతూ మంత్రంగా పాదముద్రలు సేకరించి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. నల్లజర్ల మండలంలో 9 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కెమెరాలోను పులి జాడ కానరాలేదు.

ప్రజలు, మూగ జీవాలకు రక్షణ కరువు

పెద్ద పులి సంచరిస్తుందని పదే పదే ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఫారెస్ట్ అధికాలు మిగతా ప్రభుత్వ విభాగాల అధికారులను సమన్వయం చేసుకోకుండా ఒంటరిగా వచ్చి వెళుతున్నారు తప్ప ప్రజలకు, పశువుల పెంపకందారులకు భరోసా కల్పించలేకపోతున్నారు. పొలం పనులకు వెళ్లాలంటే వ్యవసాయ కూలీలు, రైతులు భయపడిపోతున్నారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయమై ప్రజలు, మూగజీవాల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అసవరమైతే గ్రామంలోని కొంతమంది యువకులను వలంటీర్లుగా ఉపయోగించుకోవాలని చెబుతున్నారు.


పులి పాదముద్ర(ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ద్రాక్షారామ, జనవరి 30: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అన్నాయిపేటలో మంగళవారం విద్యుత్‌ఘాతానికి గురై వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి మునీంద్ర(32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి మునీంద్ర రాడ్ బెండింగ్ పనిచేస్తుంటాడు. మంగళవారం ఉదయం అన్నాయిపేటలో అల్లం రామకృష్ణ ఇంటివద్ద శ్లాబ్ పనిచేస్తూ ఉండగా ప్రమాదవశాత్తూ ఇనుప ఊచ కరెంటు తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారకస్థితికి చేరుకున్నారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గొల్లప్రోలురూరల్, జనవరి 30: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. కాకినాడరూరల్ మండలం వాకలపూడిలో నివాసముంటున్న చింతల వీరబాబు (30) రౌతులపూడి మండలం ఎస్.పైడిపాల వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. చేబ్రోలు పెద్దచెరువు వద్దకు వచ్చేసరికి ముం దు వెళుతున్న ట్రాలీ సడన్‌బ్రేక్ వేయడంతో ఢీకొట్టాడు. ప్రమాదంలో వీరబాబు అక్కడికక్కడే మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద

నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కడియం, జనవరి 30: పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారులో ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,50,000 నగదు, మరో కారులో బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.4,50,000 విలువైన 6.5 కిలోల వెండి వస్తువులు సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు, వస్తువులు తీసుకెళ్లే సమయంలో ఆధారాలు ఉండాలని, లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.


నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 3న కౌన్సెలింగ్

రంపచోడవరం, జనవరి 30: గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీ పోస్టులు(స్కూల్ అసిస్టెంట్స్, ఎల్ఎఫ్ఎల్, ప్రధానోపాధ్యాయులు) పదోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టారని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు కె.అబ్బాలోము మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్లు పొందేందుకు ఐటీడీఏ కార్యాలయంలో ఫిబ్రవరి మూడో తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు అర్హత గల ఉపాధ్యాయులు సర్వీస్ రిజిష్టరు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

అధికారులు సమన్వయంతో
పనిచేయాలి: పీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, ప్రక్కన సబ్ కలెక్టరు

రంపచోడవరం, జనవరి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నింబంధనల ప్రకారం ప్రొసీడింగ్స్ ఇచ్చిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో ఆయన సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్‌తో కలిసి నోడల్, సెక్టారు అధికారులు, తహశీల్దారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీసీ పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సెక్టారుకు సంబంధించిన మ్యాప్‌లను సిద్ధంచేసి సమర్పించాలన్నారు. నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలకు 59 మంది సెక్టారు అధికారులు, 18 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సెక్టారు, నోడల్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. అన్ని మండలాల్లో ఈవీఎంలపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో నోడల్, సెక్టారు అధికారులు, ఎన్నికల డీటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఇందిరాబాయ్ పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో
కుంట జట్టు విజేత


అంతరాష్ట్రీయ క్రికెట్ కప్పు విజేతలకు బహుమతులతో ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, జనవరి 30: చింతూరు మండలం మోతుగూడెంలో గల 15రోజులుగా జరుగుతున్న అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ 40 జట్లు పాల్గొన్నాయి. 40 జట్లు నుంచి రెండు జెట్లు ఫైనల్స్‌కి చేరుకున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్ మంగళవారం నిర్వహించారు. ఈ ఫైనల్ మ్యాచ్ టాస్ గెలిచి మోతుగూడెం క్రికెట్ క్లబ్‌జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 16ఓవర్లో 133రన్స్ మోతుగూడెం జట్లు చేసింది. ఐదు వికెట్లు నష్టపోయి అనంతరం చత్తీస్‌గడ్ రాష్ట్రం కుంట గ్రామం సెకండ్ బ్యాటింగ్ చేసి 15ఓవర్లో 140 రన్స్ చేశారు. ఐదు వికెట్లు పడిపోయాయి. దీంతో కుంట జట్టు కప్పు గెలుచుకుంది. మోతుగూడెం ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏపీ జెన్కో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, సర్పంచ్ ఆకేటి సీత విజేతలకు కప్పు, రూ.30వేలు నగదు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన మోతుగూడెం జట్టు కప్పు, రూ.15వేలు నగదు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ మోతుగూడెం టీం ప్లేయర్ భరత్‌కు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కుంట టీం ప్లేయర్ రవికి అందజేశారు. పిల్లి శ్రీను, నాగేష్‌లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో లోయర్ సీలేరు ఏపీ జెన్కో స్పోర్ట్స్ సెక్రటరీ సతీష్ రాఘవన్, జనరల్ సెక్రటరీ జాజుల రత్నాకర్, మోతుగూడెం క్రికెట్ క్లబ్ కమిటీ రాంబాబు, యేసు ప్రసాద్, గణేష్, కిరణ్, రహీం, ఏపీ జెన్కో ఉద్యోగస్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ప్లేయర్స్‌కి, ఆడియన్స్‌కి మోతుగూడెం కార్పెంటర్ సంఘం అంగ శ్రీనుకామేష్, రవి, ఏసురాజు, నగేష్ తదితరులు భోజన ఏర్పాట్లు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు
జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు

● మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

రంపచోడవరం, జనవరి 30: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. అధికార గర్వంతో జగన్మోహన్‌రెడ్డి పెట్టిన కేసులు తప్పుడు కేసులని సుప్రీంకోర్టు తీర్పులో వెల్లడైందన్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు కూడా సమర్థించిందన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గపడాలన్నారు. ప్రతిపక్ష నాయకులపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను చంద్రబాబు నాయుడు రా.. కదలిరా ద్వారా ఎత్తి చూపించారన్నారు. చంద్రబాబు సభలకు హాజరైన ప్రజానికాన్ని చూస్తే టీడీపీ ప్రజల మద్దతు ఎంత ఉందో తెలస్తోందన్నారు. గ్రాడ్యుయేట్ నిరుద్యోగిత రేటులో ఏపీ టాప్‌లో ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డ తన ఓటమిని ఇప్పటికే ఒప్పుకున్నారని, అసంతృప్తితో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతున్నారన్నారు. జగన్ తన ఆదిపత్యాన్ని కాపాడుకొనేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పావులుగా వాడుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కారం సురేష్, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, తెలుగు యువత అధ్యక్షులు సిద్ధ వెంకన్నదొర, లంకా హరిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు ధార వెంకన్న, పండా కృష్ణమూర్తి, కొమరం బాబి పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడుదాం : డిప్యూటీ డీఎంహెచ్‌వో

నల్లజర్ల, జనవరి 30: ప్రజారోగ్యాన్ని కాపాడే ప్రధాన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులదేనని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.సంధ్య అన్నారు. మండలంలోని ముసుళ్లకుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడు తూ గ్రామాల్లో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదని, అటువంటి వారికి ఆరోగ్య అవగాహన కల్పిస్తూ వైద్యాన్ని అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఆశావర్కర్లు ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని అందించేందుకు అవసరమైన కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, సీహెచ్‌వో ప్రసాదరావు, జీవీవీ ప్రసాద్, వెంకటలక్ష్మి, ఆకాశ్, నరేష్ పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' జిల్లా పోటీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో జిల్లాస్థాయి పోటీలకు ఆట స్థలాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేశామని కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలసి ఆట స్థలాలను పరిశీలించారు. రాజమహేంద్రవరంలో బుధవారం జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, డీఈఈ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బోధనలు అనుసరణీయం

» పలుచోట్ల జాతిపిత వర్ధంతి.. పలువురి ఘన నివాళి


రాజమహేంద్రవరంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: మహాత్మ గాంధీ బోధనలు అనుసరణీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. గాంధీజీ వర్ధంతిని పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాల్లో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంబాలచెరువు సెంటర్‌లో గాంధీ విగ్రహానికి గన్ని కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబి, మరుకుర్తి రవియాదవ్, మళ్ళ వెంకట్రాజు, తలారి భగవాన్, జక్కంపూడి అర్జున్ పాల్గొన్నారు. రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నగర అధ్యక్షుడు బాలేపల్లి, జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, నాయకులు దేవత సుధాకర్, బత్తిన చంద్రరావు, చామర్తి లీలావతి, యిజ్జరౌతు విజయలక్ష్మి, బాబి, సింగవరకు రామకృష్ణ పాల్గొన్నారు.

కడియం: జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమగిరి సెంటర్‌లో ఎన్టీఆర్ అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సైనికుడు బొర్రా సుబ్బారావు, సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు పాల్గొన్నారు. వేమగిరి బుద్ధవిహార్‌లో మహోదయ యాజరా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ సమయమంతుల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కడియం: జేగురుపాడులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు: కొత్తతుంగపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ళ మాచరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నాళం సూర్యనారాయణ, నాళం చంటి, కాంగ్రెస్ నాయకులు అలపాటి గోవిందు, కొత్తపల్లి ఆదినారాయణ, రాయుడు అబ్బులు, కోడి సీత, మిరియాల బాబి, రౌతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో గాంధీ విగ్రహానికి సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమికి 155కు పైగా సీట్లు

» వైసీపీని ఓడించడమే ప్రధాన లక్ష్యం
» మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్


పెందుర్తి వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బలరామకృష్ణ

కోరుకొండ, జనవరి 30: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి 155 సీట్లకు పైగా గెలుచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం కోరుకొండ టీడీపీ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు సభలకు పెద్దఎత్తున యువత రావడాన్ని బట్టి 155 సీట్లకు పైగా గెలుచుకుంటామని అభిప్రాయపడ్డామన్నారు. రాజానగరం సీటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడం పట్ల టీడీపీ శ్రేణులు ఆందోళన చెందవద్దన్నారు. వైసీపీని ఓడించడమే ప్రధాన లక్ష్యమని, అందుకు ఇన్‌చార్జిలు బొడ్డు వెంకటరమణచౌదరి, బత్తుల బలరామకృష్ణ సమన్వయంతో ఐక్యమత్యంగా ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో రొంగల శ్రీనివాస్, పీతా శ్రీనుబాబు, కొయ్యా శామ్యూల్, కోర్సు బుజ్జి, కట్టా సత్తిబాబు, పెదపాటి భీమరాజు, మాతా సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన బత్తుల

రాజానగరం ఎమ్మెల్యే టిక్కెట్‌ను జనసేన పార్టీకి కేటాయించిన నేపథ్యంలో ఆ పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ మంగళవారం సాయత్రం కోరుకొండ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పని చేసిన పెందుర్తి తన సూచనలు, సలహాలు అందజేయాలని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థి గెలిపించుకోవడంలో సహకరించాలని కోరారు. ఆయన వెంట జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, డాక్టర్ అడపా శ్రీనివాస్, దేవన దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలి

» జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి


దుప్పలపూడిలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న సిరసపల్లి

అనపర్తి, జనవరి 30: అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా చంద్రబాబుకే ఉందని, ఆయన నాయకత్వాన్ని ప్రతిఒక్కరూ బలపరచాలని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దుప్పలపూడిలో ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ చంద్రబాబును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిర్ల గంగిరెడ్డి, కుంత్యం కాశీవిశేశ్వరరావు, చిర్ల గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు : నల్లమిల్లి

కాతేరులో సోమవారం జరిగిన చంద్రబాబు రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రామవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనపర్తి నియోజక వర్గం నుంచి సుమారు 15 నుంచి 20వేల మంది హాజరయ్యారన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన బైక్ ర్యాలీ సభకే హైలెట్‌గా నిలిచిందన్నారు.

లెప్రసీ బాధితులకు మందుల పంపిణీ

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 30: ప్రపంచ లెప్రసీ నివారణ దినంలో భాగంగా బొమ్మూరు శ్రీవివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో మంగళవారం లెప్రసీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు విలువైన మందులు, టానిక్స్, పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లా కమ్యూనిటీ పారామెడికల్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. కార్యక్రమంలో పీఎంపీరాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల అధ్యక్షుడు రహమాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్, ఏ.సురేష్‌బాబు, కోలా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోరుకొండ ఎస్ఐగా ఆనంద్‌కుమార్


ఎమ్మెల్యే జక్కంపూడిని కలిసిన ఎస్ఐ ఆనంద్

కోరుకొండ, జనవరి 30: కోరుకొండ ఎస్ఐగా డి.ఆనంద్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మిని కలిశారు.

డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు, జనవరి 30: మండలంలోని కొమరిపాలెం, కాపవరం, బలభద్రపురం, రంగాపురం, కొంకుదురు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నాలుగో విడత రుణమాఫీ చెక్కులను డ్వాక్రా గ్రూపులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, జడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్‌లు వాసంశెట్టి రవికుమార్, సత్యంశెట్టి వెంకటరమణ, బుంగా రామారావు, గండికోట వీరభద్రరావు, సత్తి వీరమణి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వైసీపీ కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరి ఎంపిక

చాగల్లు, జనవరి 30: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు చాగల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం వీర్రాజు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కార్తీక్, అనుపమ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు.

నాయీబ్రాహ్మణుల పయనం టీడీపీతోనే

టీడీపీ నాయీబ్రాహ్మణ జిల్లా సాధికార సమితి సమావేశంలో నేతలు


ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిరెడ్డి వాసు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: నాయీబ్రాహ్మణులు పయనం ఎప్పుడు టీడీపీతోనే ఉంటుందని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వైద్యం శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డు లోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాయీబ్రాహ్మణ సాధికార సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు అలజంగి దేవుడు అధ్యక్షతన మంగళ వారం జరిగింది.నాయీబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోరుకునేది రాష్ట్రంలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందంటే అది కేవలం ఒక్క టీడీపీయే అని అన్నారు. జగన్ పాలనలో మాటలు తప్పితే చేతల్లో లేవన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, రెడ్డి మణి, కుడుపూడి సత్తిబాబు, కొయ్యల రమణ, కోటిపల్లి చంద్రశేఖర్, కొరిపల్లి నాగేశ్వరరావు, బలగం కిరణ్, కందికొండ అనంత్ పాల్గొన్నారు.

ఓటమి భయంతో ఎంపీ భరత్‌కు మతిభ్రమించింది

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: ఓటమి భయంతోనే రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాయకులంతా ఎంపీ భరత్ రామ్‌కు ఎప్పుడు వెన్నుపోటు పొడుద్దామా అని వేచి చూస్తున్నారన్నారు. సాక్షాత్తు జగన్ రెడ్డి వచ్చి రాజమహేంద్రవరంలో పోటీ చేసినా ఓడిపోయే పరిస్థితి నెలకొందన్నారు.

కోటేశ్వరమ్మ మృతిపై విచారణ చేయాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: ఏలూరు జిల్లా ముసునూరు మండలం చింతలవల్లి గ్రామంలో ఈనెల 15న మరణించిన కోటేశ్వరమ్మ (28) మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం దళితులకు న్యాయం చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కోటేశ్వరమ్మ కేసులో తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

3, 4 తేదీల్లో ఏఐకేఎంఎస్ మహాసభలు

ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు టాన్యా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 30 : అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 10వ మహాసభలు ఫిబ్రవరి 3, 4 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్నాయని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా అన్నారు. రాజమహేంద్రవరంలోని మావో భవన్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రోజుకు కనీసం 30 మంది వరూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని లెక్కలు చెబుతున్నాయని, వ్యవసాయం సంక్షోభంలో పడిన సమయంలో జరుగుతున్న మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.చిట్టిబాబు, సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా సంయుక్త కార్యదర్శి భీమశంకర్, సీహెచ్ రాజారెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా నాయకులు భాను ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో మోటారు వాహనాల ప్రమాద కేసుల పరిష్కారానికి, బాధితులకు తగు పరిహారం అందజేయడానికి ఇప్పటి నుంచే చర్యలకు ఉపక్రమిం చాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఈ మేరకు వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో ఆమె మంగళవారం సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న మోటారు వాహన ప్రమాద కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. త్వరలో ముందస్తు లోక్ అదాలత్ సమావేశాలను నిర్వహిస్తామన్నారు.

నెల్లిమర్ల అమరవీరులకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: రాజమహేంద్రవరం ఆర్యాపురం సామిల్లు వర్కర్స్ యూనియన్ ఆఫీసులో మంగళవారం నెల్లిమర్ల అమరవీరులకు నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 30వ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కే.జోజి, డి.శ్రీనివాస్, కె.అప్పలరాజు, కె.లాజర్, కాకుల వెంకటేశ్వర్లు, పెట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో పందలపాక విద్యార్థి


విజయవాడలో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న చైతన్యతో గైడ్ టీచర్లు


బిక్కవోలు, జనవరి 30: పందలపాక హైస్కూల్ విద్యార్థి కేఎల్ఎస్ చైతన్య విజయవాడలో జరుగుతున్న సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో మన రాష్ట్రం తరపున పాల్గొన్నాడు. చైతన్య తయారుచేసిన లైఫ్ సేవింగ్ లోకాస్ట్ వెంటిలేటర్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం రావడంతో చైతన్యకు ఈఅవకాశం దక్కింది. మంగళవారం ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి ఈఅంశాన్ని పరిశీలించి చైతన్యను, గైడ్ టీచర్లు జయకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శాంసన్, వీర్రెడ్డిలను అభినందించారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మల్లిబాబు

దివాన్‌చెరువు, జనవరి 30: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా పోరాడుదామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వంక మల్లిబాబు అన్నారు. దివాన్‌చెరువులో మంగళవారం జరిగిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ కులాలన్నీ కలసి కట్టుగా పయనిద్దామని చెప్పారు. బీసీ కులాలన్నింటినీ ఏకత్రాటి పైకి తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేద్దామన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాజానగరం మండలాధ్యక్షుడిగా సూరంపూడి శ్రీనును నియమించినట్టు మల్లిబాబు ప్రకటించారు. సమావేశంలో నాయ కులు మార్గాని చంటిబాబు, దాసరి శ్రీను, గంగి బ్రహ్మరాజు, భీమన వెంకటేశ్వరరావు గౌడ్, నీలపాలశివ, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



రేపటి నుంచి బ్యారేజీపై రాకపోకలు బంద్ 7
బాబోయ్ పెద్ద పులి



మహా.. దోపిడీ

గోదారిలో డ్రెడ్జింగ్ కుంభకోణం..

- ఎన్నికల వేళ.. అక్రమాల జోరు
- కోటి 30 లక్షల క్యూబిక్ మీటర్లు డ్రెడ్జింగ్
- రూ. 268 కోట్లతో తవ్వకానికి ఒప్పందం
- నిబంధనలు పట్టించుకోని వైనం
- రాత్రింబవళ్లు తవ్వకాలు
- బ్రిడ్జిల వద్ద తవ్వేస్తున్నారు..
- కన్నెత్తి చూడని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమాలు మరింత పెరిగాయి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో జోరు పెంచారు. ఎక్కడికక్కడ ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.. అందినకాడికి దోచుకునేందుకు తెగబడుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ అనుమతి లేకుండా రాత్రీ పగలూ అనధికారికంగాడ్రెడ్జింగ్ సాగుతూనే ఉంది. నిత్యం వందలాది డ్రెడ్జింగ్ పడవలతో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతుంది.మరో పక్క గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందిన సంస్థ పేరుతో డిసెంబర్ నుంచి మరింత డ్రెడ్జింగ్ జరుగుతోంది. ఇదో పెద్ద కుంభకోణమం టూ విమర్శలు వస్తున్నాయి. గత మే నెల నుంచి అనుమతులు లేకుండా ఇరిగేషన్, మైన్స్ అధికారుల నుంచి కూడా కనీస అనుమతులు తీసుకోకుండా జిల్లా శాండ్ కమిటీ నుంచి ఆమోదం పొందినట్టు చెబుతూ.. కనీస ఆధారాలు కూడా చూపకుండా గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచిన సంగతి తెలిసిందే. కొద్దిరోజుల నుంచి ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగారు. కానీ నిబంధనలు పట్టించుకోకుండా డ్రెడ్జింగ్ కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ దోపిడీ ఇలా ఉంటే, అధికారికంగా డ్రెడ్జింగ్ అంటూ మరొకరు రంగంలోకి దిగారు. సుమారు రెండేళ్ల కిందట బ్యారేజీకి ఎగువ నుంచి గామన్ బ్రిడ్జి వరకూ అఖండ గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం, ఇసుక తిప్పలు తొలగించడం కోసం అధికార వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. అప్పట్లో ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు.కానీ మెరిట్ ఉన్నవారిని కాదని..తక్కువ అర్హత ఉన్న కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు భయపడి చాలా రోజులు ఆమోదించలేదు.ఈ సంఘటనతో ఇరిగేషన్ ఎస్ఈ ఒకరు బదిలీ అయ్యారు. పోలవరంలో పనిచేసే మరో ఎస్ఈని ఇక్కడకు రప్పించి ఇన్‌చార్జిగా పెట్టి చాలా కాలం తర్వాత నెమ్మదిగా వారికి నచ్చిన కాంట్రాక్టర్‌కే ఒకే చేయించారు. కానీ ఎం దువల్లనో కాంట్రాక్టర్ చాలా కాలం వదిలేశారు. ఇటీవల రంగంలోకి దిగారు. ఒప్పందం ప్రకారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి గామన్ బ్రిడ్జికి 800 మీటర్ల లోపు వరకూ మొత్తం కోటి 70 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక డ్రెడ్జింగ్ చేయాలి. దీని కోసం క్యూబిక్ మీటరుకు రూ.155 వంతున ప్రభుత్వం సదరు కాంట్రాక్టు సంస్థకు చెల్లించాలి. అంటే మొత్తం రాజమహేంద్రవరం వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.144 కోట్లు, కొవ్వూరు వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.124 కోట్లు కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి ఒప్పందం జరి గింది. ఈ ఒప్పందం ప్రకారం కాంట్రాక్టర్ పెద్ద డ్రెడ్జర్లు పెట్టి ఇసుక తిప్పలు తొలగించి, ఇసుకను గోదావరి ఒడ్డున పోగు పెట్టాలి. దానిని వేరేవాళ్ల చేత ప్రభుత్వం అమ్మించి డబ్బు చేసుకుంటుంది.డ్రెడ్జింగ్ వల్ల గోదావరిలో నీటి నిల్వ శాతం పెరగాలనేది లక్ష్యం. కానీ ఇక్కడ కాంట్రాక్టర్ ఎంత ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారో చెప్పడానికి ఎవరూ కనిపించరు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుక ప్రత్యేకంగా ఎక్కడా పోగులు పెట్టినట్టు లేదు. గతంలో డ్రెడ్జింగ్ చేసి వెంటనే అమ్మేసినట్టే ఇప్పుడూ జరుగుతోంది. అధికారికంగా డ్రెడ్జింగ్ చేసిన కాంట్రాక్టరు ప్రత్యేకంగా ఇసుక పోగు చేసి, ఇరిగేషన్ అధికారులకు కానీ, ఏపీ ఎండీసీకి గానీ అప్పగించాలి.ఇక్కడ ఏమి జరుగుతుందో ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు.గతంలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట వైసీపీ నేతలు నడుపుతున్న ర్యాంపుల్లో కూడా డ్రెడ్జింగ్ సాగుతూనే ఉంది. గాయత్రీ, కోటిలింగాల, కాతేరు, వెంకటనగర్ ర్యాంపులు, కొవ్వూరులో కూడా డ్రెడ్జింగ్ జరుగుతోంది.

బ్రిడ్జిల ప్రక్కనా తవ్వేస్తున్నారు..


వాస్తవంగా గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం డ్రెడ్జింగ్ చేస్తే బ్యారేజీకి మూడు కిలోమీటర్ల వరకూ ఎటువంటి తవ్వకాలు జరగకూడదు. గోదావరి రోడ్డుకమ్ రైలు బ్రిడ్జి వైపు అప్‌స్ట్రీమ్‌లో ఎగువ వైపు 500 మీటర్లు, దిగువ ప్రాంతంలో 300 మీటర్ల వరకూ డ్రెడ్జింగ్ చేయ కూడదు. ఇసుక తవ్వకాలు జరగకూడదు. ఇది నిబంధన. అంతేకాక గతంలో నిపుణుల కమిటీ కూడా ఇక్కడ ఇసుక తవ్వితే బ్రిడ్జిలకు ప్రమాదమని హెచ్చరించిన సంగతి తెలిసిందే.కానీ ఎక్కడా నిబంధనలు పాటించడంలేదు. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. రాత్రీ పగలూ ఒకటే పని. ఇది ఏ ప్రమాదానికి దారితీస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పైగా డ్రెడ్జింగ్ ఒక పద్ధతి ప్రకారం జర గాలి. పెద్ద డ్రెడ్జర్లతో పని జరగాలి. ఇవాళ వంద వరకూ డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వేస్తున్నారు.

గామన్ బ్రిడ్జి అవతలా ఇంతే..

ప్రభుత్వం ఒప్పందం పొందిన కాంట్రాక్టు సంస్థ ఇసుక తవ్వినా గామన్ బ్రిడ్జి అవతల అనుమతి లేదు. కానీ కాతేరు, వెంకటనగర్, తాళ్లపూడి వైపు ఇష్టాను సారం తవ్వేస్తున్నారు. గామన్ బ్రిడ్జికి ఇవతల 800 మీటర్ల వరకూ తవ్వకూడదనే నిబంధన ఉంటే సమీ పంలోనే తవ్వేస్తున్నారు.అయినా ఎవరూ పట్టించుకోవ డంలేదు. అధి కారులెవరూ నోరుమెదపడంలేదు. ఎన్ని కల ముందు దోచు కున్నంత దోచేసుకోవడం కోసమే ఈ రకమైన అక్రమాల జోరు పెంచినట్టు అర్థమవుతోంది.

మళ్లీ ఉచిత ఇసుక విధానం
చంద్రబాబు ప్రకటనతో ప్రజల్లో జోష్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



వైసీపీ ప్రభుత్వం ఇసుక ధరలు పెంచడమే కాకుండా, ఇష్టానుసారం దోపిడీ చేస్తున్న సంగతి తెలిసిందే. కానీ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాతేరులో సోమవారం జరిగిన రా కదలిరా భారీ బహిరంగ సభలో మాట్లా డుతూ మళ్లీ ఉచిత ఇసుక విధానం తీసుకొస్తామని ప్రకటించారు.అంతే కాక ఇక్కడ ఇసుక దోపిడీ చేస్తున్న వారిపై విచారణ చేసి చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ బాధ్యతను టీడీపీ- జనసేన ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో అన్ని వర్గాల్లోనూ ఆశలు పెరిగాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లు, బిల్డర్లు, భవన నిర్మాణ కార్మికులకు ప్రాణం లేచివచ్చినట్టయ్యింది. ఇంతవరకూ ఇసుక అక్రమాలతో పాటు ఇసుక ధరలు విపరీతంగా పెరగడం, అవసరమైన సమయాల్లో అందుబాటులో లేక పోవడంతో అన్ని వర్గాలు ఇబ్బందులు పడిన సంగతి తెలిసిందే. చాలా మంది తమ ఇళ్ల నిర్మాణాలు వాయిదా వేసుకున్నారు.ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని చేసిన ప్రకటన అన్ని వర్గాల్లోనూ జోష్‌ను పెంచింది. 2019 వరకూ కూడా చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసిన సంగతి తెలిసిందే.

'యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 30 : యానిమేటర్లకు ఉద్యోగభద్రత కల్పించకపోతే సమ్మెలోకి వెళ్లక తప్పదని ఆంధ్రప్రదేశ్ ఆర్‌పీలు, యానిమేటర్ల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల కాలపరిమితి విధించి యానిమేటర్లను తొలగించడం అన్యాయమన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ యానిమేటర్లను తొలగించాలనుకోవడం అన్యాయమన్నారు.సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వరలక్ష్మీ, కోశాధికారి కనక, జిల్లా నాయకురాలు లలిత, ఈశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు నన్నయ స్నాతకోత్సవం
- ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- సుధామూర్తికి డాక్టరేట్ ప్రదానం
7

ఈ ప్రమాదాలకు బాధ్యులెవరు?

గతేడాది జూలై 26న తుని మండలం చేపూరు జంక్షను వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న భర్త,భార్య, కుమారుడిని లారీ ఢీకొన్న ఘటనలో తల్లీ, కొడుకు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. జంక్షనుకు మూడు కిలో మీటర్ల ముందు నుంచీ రోడ్డు డౌన్‌గా ఉంటుంది. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టింగ్ స్టడ్స్, సిగ్నల్స్ వంటివేమీ ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికు లు మండిపడుతున్నారు.అదే నెల 27న గోపాలపురం మండ లం కరిచర్లగూడెం వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలు విడిచారు.

అధికారుల నిర్లక్ష్యం..

బొమ్మూరు సమీపంలోని హార్లిక్స్ ఫ్యాక్టరీ దాటిన తర్వాత భూలోకమ్మ గుడి దగ్గర ధవళేశ్వరం వైపు వెళ్లడానికి రోడ్డు ఉం టుంది. ఆ రోడ్డు ప్రారంభం నుంచి మరో రహదారి కుడివైపునకు వెళుతుంది.ఈ రెండూ బాగా డౌన్‌గా ఉంటాయి.దీంతో యూటర్న్ తీసుకునే సమయంలో, ధవళేశ్వరంవైపు తిరిగే సమ యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు.ఎస్పీ జగదీశ్ స్వయంగా వెళ్లి పరిశీలించారు.ఆ రోడ్డును అక్కడ తొలగించి..కొద్ది మీటర్ల దూరం లో ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు లేఖ రాశారు. కార్యాచరణ మాత్రం దారిలో ఉంది.

వాహనదారులకు పరీక్ష..

సాక్షాత్తూ ఎస్పీ కార్యాలయం సమీపంలో డీటీసీ సెం టర్‌ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఈ జంక్షనులో హైవేకు ఏకంగా మూడు సర్వీసు రోడ్లు, నగరం నుంచి వెళ్లే రహదారి, శ్రీరాంపురం వైపు వెళ్లే రోడ్డు మొత్తం ఐదు రహదారులు కలుస్తాయి.అందువల్ల ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. కానీ ఇక్కడ కనీసం సరిపడా లైటింగ్ లేదు. కనీసం సిగ్నల్స్ పని చేయవు. వాహనాదారులు తమ ప్రాణాలకు పరీక్ష పెడుతూ ముందుకు కదలాల్సిందే.

రోడ్లపై.. ప్రాణాలు!



ఈ నెల 2న దేవరపల్లి వద్ద జరిగిన ప్రమాదం

రహదారుల.. రక్త చరిత్ర

- రోజూ ప్రాణాలను మింగేస్తున్న రోడ్లు
- బ్లాక్ స్పాట్లపై నిలువెత్తు నిర్లక్ష్యం
- జిల్లావ్యాప్తంగా 35 గుర్తింపు
- శాఖల మధ్య సమన్వయ లోపం
- లేఖలతో సరిపెడుతున్న అధికారులు
- గతేడాది 350 మంది పైనే మృతి
- మాసోత్సవాలతో ఒరిగేదేంటి?
- బ్లాక్ స్పాట్ల వద్ద చర్యలకు డిమాండ్

రహదారి భద్రత మాసోత్సవాలు.. ప్రతి పాఠశాలకు వెళ్లి అధికారులు చాలా గొప్పగా చెబుతున్నారు.. అయితే చేయాల్సింది చేయకుండా ఏం చెబితే ఏం లాభం.. రోడ్డుపైకి వెళితే ఇంటికి వచ్చే వరకూ టెన్షనే.. ప్రస్తుతం పరిస్థితి అంత ప్రమాదకరంగా మారింది.. ఎందుకంటే ప్రమాదాలు ఆ స్థాయిలో పెరిగిపోయాయి.. మూడు నెలల కిందట ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా 35 బ్లాక్ స్పాట్లను గుర్తించారు.. నేటికీ ప్రమాదాల నివారణకు అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం.. దీంతో ఎందుకీ ఉత్తుత్తి రహదారి భద్రత మాసోత్సవాలు అంటూ జనం మండిపడుతున్నారు. ముందు రహదారి భద్రత చర్యలు చేపట్టి తరువాత మాసోత్సవాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'భాండశుద్ధిలేని పాకమేల? చిత్తశుద్ధి లేని శివపూజలేలరా? విశ్వదాభి రామ వినురవేమా'- వేమన. ఈ అద్భుతమైన మాటలు రహదారి భద్రతలో యంత్రాంగం చూపిస్తున్న నిబద్ధతకు సరిగ్గా సరిపోతాయేమో! రహదారి భద్రత కరువై వందలాది ప్రాణాలను రోడ్లు మింగేస్తున్నాయి. రోడ్డుపైకి వెళ్లే వాహనం క్షేమంగా ఇంటికి చేరుతుందనే గ్యారంటీ కరువైంది. ఇల్లు చేరడానికి కొంచెం ఆలస్యమైతే ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని ఇంట్లో వాళ్లు బెంబేలెత్తిపోతున్నారు. రక్తం మరిగిన రహదారుల కోరలు విరచాల్సిన యంత్రాంగం సమన్వయలోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ, ఆర్‌అండ్‌బీ, మునిసిపాలిటీ, రవాణా, విద్యుత్, పోలీస్ వెరసి ప్రభుత్వం.. నిర్లక్ష్యం ఎవరి దైనా రోడ్లకు నిండు ప్రాణాలు బలై కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. అధికారులు లేఖలతో సరిపెడు తుండగా బ్లాక్ స్పాట్ల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. ఇప్పటికే గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా(ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశం)ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లోనూ అలసత్వం కనిపిస్తోంది.జిల్లాలో గతేడాది రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం చెందిన వారి సంఖ్య 350 దాటిపో యింది. బ్లాక్ స్పాట్ల సంఖ్య తగ్గించడానికి ప్రయత్నాలు ఎంత వరకూ జరుగుతున్నాయో గానీ ఆ సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకూ నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల వల్ల ఉపయోగం ఎంత ఉంటుందో వేచి చూడాల్సిందే.

మృత్యుకుహరాల్లా జాతీయ రహదారులు

జిల్లాలోని మునిసిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిలో జాతీయ రహదారులు మృత్యుకుహరాల్లా మారిపోయాయి. ఎన్‌హెచ్ఏఐ ప్రతీ పనికీ కాంట్రాక్టులపై ఆధారపడడంతో తగిన ఫలితాలు సాధించలేకపోతున్నామనే విమర్శలున్నాయి.జిల్లాలో గుర్తించిన 35 బ్లాక్‌స్పాట్లలో జాతీయ రహదారిపై 28 ఉండగా, స్టేట్ హైవేలపై 5, ఇతర రోడ్లపై 2 ఉన్నాయి. ఎన్‌హెచ్ 16(ఏ), 16, 516(ఈ), 365బీబీ, 516డీ, ఆర్ అండ్ బీ రోడ్లపై గతేడాది 700 వరకూ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 336 మంది ప్రాణాలు బలైపోయాయి. ఒకసారి బ్లాక్‌స్పాట్‌గా కేంద్ర ప్రభుత్వ రహదారుల మంత్రిత్వ శాఖ వద్ద రిజిస్టరు కాగానే రూ.25లక్షలు మంజూరవుతాయి. వాటితో బ్లాక్‌స్పాట్లు, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల్లో ప్రమాద నివారణా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాల్సి ఉంటుంది.ఆ సమన్వయం కొరవడడంతో బ్లాక్‌స్పాట్లలో సైతం జాగ్రత్త చర్యలను మమ అనిపిస్తున్నారు. ఇక ఆర్ అండ్‌బీ పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. నిధుల లేమితో కొట్టు మిట్టాడుతుండడంతో ఏదోకటి చేసి అయిందనిపిస్తున్నారు.

బ్లాక్‌స్పాట్లలో ఏం చేయాలి

కొద్ది దూరంలో బ్లాక్‌స్పాట్ ఉందనే హెచ్చరిక బోర్డు. రిఫ్లెక్టింగ్ స్టడ్స్(క్యాట్‌ఐస్), థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్స్, డౌన్ సర్వీసు రోడ్లలో రిఫ్లెక్టింగ్ కాన్వెక్స్ అద్దాలు, రంబుల్ స్ట్రిప్స్, సరిపడా లైటింగ్, జిగ్‌జాగ్‌గా స్టాపర్ బోర్డులు, ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సబ్ కంట్రోళ్లు, సర్వీసు రోడ్లలో స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలను పటిష్టం చేయాలి. సిబ్బందిని నియా ఉంచి తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి. వాస్తవానికి నిబంధనల ప్రకారం అంచనా వేసి ఒక ప్రదేశాన్ని పోలీసులు బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తారు. అక్కడ జాగ్రత్త చర్యలు తీసుకోడానికి ఆ శాఖ వద్ద నిధులు ఉండవు. పోలీసు సిబ్బందిని కాపలా పెట్టడానికి సిబ్బంది కొరత ఇప్పటికే విపరీతంగా వేధిస్తోంది. ఇక.. రోడ్డు మార్జిన్లు, మార్కింగ్స్, రిఫ్లెక్టింగ్ కాన్వెక్స్ మిర్రర్స్ వంటివి ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలి. వాటి నిమిత్తం వారి వద్ద నిధులు ఉంటాయి. కానీ, ఎందుకో ముందస్తు జాగ్రత్తలపై పెద్దగా దృష్టి సారిస్తున్నట్టు కనిపించడం లేదు. రాజమహేంద్రవరంలో కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్‌నీ సరిగా నిర్వహించలేని దుస్థితి వేధిస్తోంది.

ఇలా చేస్తే బెటర్...

జాతీయ రహదారులు లేదా రెండు లేన్లు, సింగిల్ లేన్ (వరుస) రోడ్లపై స్పీడుగా వెళ్లే, నింపాదిగా వెళ్లే, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు, కార్లు ఏవి ఏ లేనులో వెళ్లాలో ఇప్పటికీ అధిక శాతం మంది వాహనదారులకు అవగాహన లేదు. దీనిపై విస్తృతంగా చైతన్యం తేవాల్సిన అవసరం ఉంది. టోల్‌గేట్ల వద్ద ఫోన్ నంబరు తీసుకొని సదరు వాహనదారుడిని అప్రమత్తం చేసే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణపై మెసేజ్‌లను పంపొచ్చు. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించవచ్చు. అతి వేగంగా వెళ్లే వాళ్లను గుర్తించి కౌన్సెలింగ్ చేయడం, అవసర మైతే కేసులు నమోదు చేయడం చేయవచ్చు. రోడ్లపై ఇష్టాను సారం పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించ వచ్చు. రోడ్ల పక్కన ప్రమాద నివారణ సూచన, హెచ్చరిక బోర్డులను విస్తృతంగా ఏర్పాటు చేయవచ్చు.రాత్రి వేళల్లో అక్కడక్కడా ఆకస్మిక తనిఖీలు చేసి లారీలు, బస్సుల వంటి భారీ వాహనాల డ్రైవర్ల పరిస్థితిని అంచనా వేయవ చ్చు.వారి ముఖాలను నీటితో కడిగించి పంపించవచ్చు. ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావిస్తే వాహనం కాసేపు పక్కకు నిలపాలని ఆదేశించవచ్చు.అయితే పోలీసు శాఖకు ఇలాంటివి వీలుపడకపోవడం గమనార్హం.

ప్రమాదాలకు కేరాఫ్ దేవరపల్లి


జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషను పరిధిలో రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. జాతీయ రహదారుల పరిధి ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు రోడ్డు ప్రమాదాల కేసుల నమోదు,దర్యాప్తు, విచారణలు ప్రహసనంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ గణాంకాలు పరిశీలిస్తే 25 పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ప్రమాదాలు నమోదయ్యాయి. రోడ్ల ప్రమాదాల కేసుల్లో దేవరపల్లి మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానాల్లో వరుసగా బొమ్మూరు, రాజానగరం, టూ టౌన్ (రాజమహేంద్రవరం), పెరవలి ఉన్నాయి. మృత్యువాత పడిన కేసుల్లో కూడా దేవరపల్లి(40) మొదటి స్థానంలో ఉంది. తర్వాత వరుసగా రాజానగరం (25), బొమ్మూరు(23), నల్లజర్ల(19), టూటౌన్, గోకవరం, రంగంపేట, కొవ్వూరుటౌన్, గోపాలపురంలో 14 మంది చొప్పున ప్రాణాలు విడిచారు.





ఆందోళన చేస్తున్న బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో కంపెనీ కార్మికులు

జావగార్చేశారు!



తాళ్లపూడి, జనవరి 30 : ప్రభుత్వ పథకం జావ గారిపోతోంది. అయినా పట్టించుకునేవారే లేరు. తాళ్లపూడి మండలం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పంపిణీ చేసే రాగి జావ పురుగులు మయంగా ఉంది.ప్రభుత్వం ఈ నెల వారం రోజుల్లో ఎక్స్‌పైరీ అయిపోయే నిల్వ రాగి పిండిని పండుగ ముందు కొన్ని పాఠశాలలకు సరఫరా చేసింది. సంక్రాంతి సెలవులు తరువాత పిల్లలకు రాగి జావ ఇద్దామని చూస్తే పిండిలో పురుగులు కనిపించాయి. పాకెట్ల మీద జనవరి 15తో గడువు ముగిసి ఉండడంతో పంపిణీకి సాహసం చేయలేదు. దీనికి తోడు జిల్లా అధికారుల నుంచి రాగి జావ స్టాక్‌లో చూపవద్దని సూచించినట్టు సమాచారం సరఫరా చేస్తున్న వస్తువులు బాగుండకపోయినా వాటిని హెచ్‌ఎంలు తీసుకుని డంప్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిం పులు జరిగిపోతున్నాయి..పరోక్షంగా ప్రభుత్వ నిధులకు గండి పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

లే ఆఫ్ ఎత్తివేయాలి

బిక్కవోలు, జనవరి 30: బలభద్రపురం శివారు కానేడులో ఉన్న బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రకటించిన లేఆఫ్‌ను వెంటనే ఎత్తివేసి ఫ్యాక్టరీని తెరవాలని కార్మికులు డిమాండ్ చేశారు. బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతేడాది నవంబరు 28న చట్టవిరుద్ధంగా యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి ఉత్పత్తి నిలుపుదల చేసిందన్నారు. ఈ విషయాన్ని డీసీఎల్‌కు ఫిర్యాదు చేయగా యాజమాన్యంతో కార్మికులతో చర్చించి పరిశ్రమను యథావిధిగా నడపమని ఆదేశించారన్నారు.పరిశ్రమ తెరచి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకం పేరు చెప్పి...
లింక్ క్లిక్ చేయమని డబ్బులు కొట్టేశాడు..

కొవ్వూరు, జనవరి 30 : ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో నమ్మించి ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాను ఖాళీ చేసిన ఘటన ఇది.. కొవ్వూ రు 2వ వార్డులో వలంటీరు మాణిక్యంకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2-45 గం టలకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. నేను రాజధాని అమరావతి నుంచి మాట్లాడుతున్నాను. మీ క్లస్టర్ పరిధిలో ప్రభుత్వ పథకాలు ఆగిపోయిన వారు ఎవరైనా ఉన్నారా అని అడిగాడు. వెంటనే ఆ వలంటీరు పట్టణానికి చెందిన దేగల రామకృష్ణ ఫోన్ నెంబరుకు కాన్ఫరెన్సు కలి పాడు.దీంతో ఆ అపరిచిత వ్యక్తి రామకృష్ణను మీకు పథకాలు ఎందుకు రావడం లేదని అడిగాడు. 1000 ఎస్ఎఫ్‌టీలో ఇల్లు ఉండడంతో పథకాలు ఇవ్వడం లేదని వాపోయాడు. మీకు వాహనమిత్ర రాదు.. కాపునేస్తం వేస్తున్నాను మీ ఫోన్ లింక్ పంపించానని.. ఆ లింక్ ఓపెన్‌చేయమని అవతలి వ్యక్తి తెలిపాడు.. లింక్ ఓపెన్ చేసిన వెంటనే రామకృష్ణ బ్యాంకు ఖాతా నుంచి మొదటగా రూ.15 వేలు దొంగిలించడానికి ప్రయత్నించగా ఖాతాలో అంత సొమ్ము లేకపోవడంతో ఫెయిలైంది. ఆ తరువాత మళ్లీ ప్రయత్నించి రూ.6వేలు దొంగిలించాడని రామకృష్ణ మంగళవారం కమిషనర్ బి.శ్రీకాంత్, ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారికి ఫిర్యాదు చేశారు.



కమిషనర్ శ్రీకాంత్, ఛైర్‌పర్సన్ రత్నకుమారికి ఫిర్యాదు చేస్తున్న దేగల రామకృష్ణ

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రజారోగ్యాన్ని కాపాడుదాం

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య



ముసుళ్లకుంటలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సంధ్య

నల్లజర్ల, జనవరి 30: ప్రజారోగ్యాన్ని కాపాడే ప్రధాన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులదేనని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.సంధ్య అన్నారు. మండలంలోని ముసుళ్లకుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదని, అటువంటి వారికి ఆరోగ్య అవగాహన కల్పిస్తూ వైద్యాన్ని అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఆశావర్కర్లు ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని అందించేందుకు అవసరమైన కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, సీహెచ్‌వో ప్రసాదరావు, జీవీవీ ప్రసాద్, వెంకటలక్ష్మి, ఆకాశ్, నరేష్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



ఉపాధ్యాయులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు, జనవరి 30: ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నట్టు ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. కొవ్వూరు మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు ఎంపీపీ నిధులు రూ.40 వేలతో క్రీడా పరికరాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు ఏవీడీ ప్రసాద్, ఎస్.నాగరాజు, ఎస్.వీరబాబు, రాజేంద్రకుమార్, జొన్నకూటి పాండు, రాయుడు, రాంబాబు, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

కొవ్వూరు వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కొవ్వూరు, జనవరి 30: కొవ్వూరు వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దేవతు కృష్ణప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగింది. అధ్యక్షుడిగా దేవతు కృష్ణప్రసాద్, కార్యదర్శిగా రాఘవ రమాకాంత్, కోశాధికారిగా సత్యవరపు గురునాథంలతో జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నారాయణ సురేష్, మడిపల్లి భాస్కరం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, మద్దుల సత్యనారాయణ, నాళం శ్రీనివాసరావు, గ్రంధి ప్రవీణ్, కొల్లేపర శ్రీనివాస్ పాల్గొన్నారు.

జంతు కబేళా షెడ్డు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దేవరపల్లిలో అనధికారికంగా ఉన్న కబేళ షెడ్డును తొలగిస్తున్న జేసీబీ

దేవరపల్లి, జనవరి 30: దేవరపల్లిలో అనధికారికంగా నిర్వహిస్తున్న జంతు కబేళా షెడ్డును తొలగించి పశువుల ఎముకలు, కాళ్లు, పుర్రెలు, పశువుల వ్యర్థాలను కాల్చి గొయ్యితీసి పూడ్చినట్టు పంచాయతీ కార్యదర్శి రవికిషోర్ తెలిపారు. 'బలి' పశువులు శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. దేవరపల్లి శివారు పోలవరం గట్టుపై స్థావరం ఏర్పాటు చేసుకుని జిల్లా నలుమూలల నుంచి పశువులను తీసుకొచ్చి అర్ధరాత్రులు కోతకోయడంతో దుర్గంధం వస్తుండడంతో దీన్ని పంచాయతీ అధికారులు తొలగించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరి ఎంపిక

చాగల్లు, జనవరి 30: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు చాగల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం వీర్రాజు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కార్తీక్, అనుపమ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఎంఈవో వి.ఖాదర్‌బాబు, ఉపాధ్యాయుడు మోహనకృష్ణ, వి.శ్రీనివాసరావు అభినందించారు.

వాదాలకుంట పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

గోపాలపురం, జనవరి 30: మండలంలోని వాదాలకుంట పోలింగ్ కేంద్రాన్ని సీఐ రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్నికల కార్యాచరణలో భాగంగా అంతర్ జిల్లాల చెక్‌పోస్టును జగన్నాథపురంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు చెప్పారు.

పెద్దేవంలో 'ఆరోగ్య సురక్ష'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి

తాళ్లపూడి, జనవరి 30: మండలంలోని పెద్దేవం జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విచ్చేశారు. ఆరోగ్య సురక్షా పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అన్నపూర్ణ, చందన, భాగ్యలక్ష్మి, సాయికుమారి 400 మందికి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొవ్వూరు, జనవరి 30: కొవ్వూరులో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ సమీపంలో ఫ్లైఓవర్‌పై దొమ్మేరు వైపు డౌన్‌లో తెల్లవారుజామున 40 నుంచి 45 ఏళ్ల వయసున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. వార్డు రెవెన్యూ సెక్రటరీ కె.మౌనిక ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ జె.శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లపూడి/నల్లజర్ల, జనవరి 30: విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఈ నెల 31న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు తెలిపారు. దీంతో తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకూ, 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. అలాగే నల్లజర్ల మండలం పోతవరంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అనంతపల్లిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.



కొవ్వూరులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నిడదవోలులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గాంధీకి నివాళి

» పలుచోట్ల మహాత్ముని వర్ధంతి కార్యక్రమాలు

కొవ్వూరు, జనవరి 30: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాల్లో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వూరు మెయిన్‌రోడ్‌లోని గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య కళ్యాణ మండపానికి చేరుకుని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాళం శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, మద్దుల సత్యనారాయణ, ఎంబీఎస్ ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, కక్కిరాల సూరిబాబు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెలగా రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌరీపట్నం గురుకుల విద్యాలయంలో గాంధీ చిత్రపటానికి రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ మహాత్మగాంధీ అహింసామార్గంలో ఉద్యమం నడిపించి దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఆయన ఎంతో పాటుపడ్డారన్నారు. ఆయనను మనమంతా స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు లావణ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చాపల చైతన్య, గుత్తికొండ సూరిబాబు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పార్టీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత మహాత్ముని ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, షాజహాన్, ఆకుతోట సతీష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక ఎల్‌బీ శాస్త్రి మున్సిపల్ పాఠశాలలో వాసవీ క్లబ్ వనిత ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర పోరాటంలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష, జవ్వాది శిరీష, జయవరపు లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని మల్లవరం మహాత్మా గాంధీ వృద్ధాశ్రమంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చర్ల గణపతిశాస్త్రి, సుశీల సాహిత్య పురస్కారాన్ని తెలుగు అధ్యాపకురాలు వరలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో లకంసాని సూర్యప్రకాశరావు, బండి వెంకటేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు చర్ల మృదుల కుమారి, విధుల, నిడదవోలు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం శాఖాగ్రంథాలయంలో విగ్రహదాత అద్దేపల్లి విజయకుమార్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, గ్రంథపాలకుడు జి.కృష్ణారావు, పాఠకులు పాల్గొన్నారు. దమ్మెన్ను గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ జి.సత్యనారాయణ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లి: దుద్దుకూరులో నివాళులర్పిస్తున్న రామకృష్ణ



చాగల్లు: మల్లవరంలో నివాళులర్పిస్తున్న ప్రముఖులు



ఉండ్రాజవరంలో గాంధీ విగ్రహానికి నివాళులు

విశాఖపట్నం డీపీటీవోపై చర్యలు తీసుకోవాలి

» నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

» కొవ్వూరు, నిడదవోలు ఆర్టీసీ డిపోల్లో నిరసన

కొవ్వూరు, జనవరి 30: అప్రజాస్వామికంగా నియంతృత్వ వైఖరి అవలంబిస్తున్న విశాఖపట్నం డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని కొవ్వూరు నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కొవ్వూరు ఆర్టీసీ డిపో వద్ద నల్లరిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలను విడనాడాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులు నిరసనలు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు వీకేఎం స్వామి, డిపో సెక్రటరీ ఎం.శివకుమార్, సీహెచ్ శివ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు



నిడదవోలులో ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆర్టీసీ సిబ్బంది

నిడదవోలు: నిడదవోలులోని ఆర్టీసి డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ జిల్లా డీపీటీవో నియంతృత్వ ధోరణి, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి రాము, ఎస్‌కే ఫాజియా, ధనరాజు, హనుమంతరావు, ఎస్.సురేష్, కె.రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమికి 155కు పైగా సీట్లు

» వైసీపీని ఓడించడమే ప్రధాన లక్ష్యం

» మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్

కోరుకొండ, జనవరి 30: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి 155 సీట్లకు పైగా గెలుచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం కోరుకొండ టీడీపీ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు సభలకు పెద్దఎత్తున యువత రావడాన్ని బట్టి 155 సీట్లకు పైగా గెలుచుకుంటామని అభిప్రాయపడ్డామన్నారు. రాజానగరం సీటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడం పట్ల టీడీపీ శ్రేణులు ఆందోళన చెందవద్దన్నారు. వైసీపీని ఓడించడమే ప్రధాన లక్ష్యమని, అందుకు ఇన్‌చార్జిలు బొడ్డు వెంకటరమణచౌదరి, బత్తుల బలరామకృష్ణ సమన్వయంతో ఐక్యమత్యంగా ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో రొంగల శ్రీనివాస్, పీతా శ్రీనుబాబు, కొయ్యా శామ్యూల్, కోర్పు బుజ్జి, కట్టా సత్తిబాబు, పెదపాటి భీమరాజు, మాతా సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన బత్తుల

రాజానగరం ఎమ్మెల్యే టిక్కెట్‌ను జనసేన పార్టీకి కేటాయించిన నేపథ్యంలో ఆ పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ మంగళవారం సాయంత్రం కోరుకొండ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పని చేసిన పెందుర్తి తన సూచనలు, సలహాలు అందజేయాలని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థి గెలిపించుకోవడంలో సహకరించాలని కోరారు. ఆయన వెంట జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, డాక్టర్ అడపా శ్రీనివాస్, దేవన దుర్గాప్రసాద్ తదితరులున్నారు.



పెందుర్తి వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బలరామకృష్ణ

కమ్మేసిన పొగమంచు



దేవరపల్లి, జనవరి 30: దేవరపల్లిలో మంగళవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లినా కనిపించని విధంగా రహదారులు పొగమంచుతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం 7.30గంటల వరకు పొగమంచు దట్టంగా పడడంతో రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలు వెళ్లడానికి ఇబ్బందులుపడ్డారు. తెల్లవారు లేచి చూసే సరికి గ్రామమంతా పొగమంచు కప్పిఉండడంతో ప్రజలు ఒకింత ఆనందం పొందారు.

ఓటమి భయంతో ఎంపీ భరత్‌కు మతిభ్రమించింది

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: ఓటమి భయంతోనే రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాయకులంతా ఎంపీ భరత్ రామ్‌కు ఎప్పుడు వెన్నుపోటు పొడుద్దామా అని వేచి చూస్తున్నారన్నారు. సాక్షాత్తు జగన్ రెడ్డి వచ్చి రాజమహేంద్రవరంలో పోటీ చేసినా ఓడిపోయే పరిస్థితి నెలకొందన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు : హోం మంత్రి

దూబచర్ల-ద్వారకాతిరుమల రోడ్డుకు శంకుస్థాపన



దూబచర్లలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల, జనవరి 30: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధి పనులు చేస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. రూ.6.26 కోట్లతో దూబచర్ల నుంచి ద్వారకాతిరుమల వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు మంగళవారం అమె దూబచర్లలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ద్వారకాతిరుమల వెళ్లే భక్తులకు ఈ రోడ్డు మార్గం అనుకూలంగా ఉంటుందన్నారు. దూబచర్ల నుంచి 9 కిలో మీటర్లకే ద్వారకాతిరుమల వస్తుందన్నారు. పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, కారుమంచి రమేష్, అచ్యుత శివాజీ, గుడిసె సత్యనారాయణ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల పయనం టీడీపీతోనే

టీడీపీ నాయీబ్రాహ్మణ జిల్లా సాధికార సమితి సమావేశంలో నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: నాయీబ్రాహ్మణులు పయనం ఎప్పుడు టీడీపీతోనే ఉంటుందని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వైద్యం శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డు లోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాయీబ్రాహ్మణ సాధికార సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు అలజంగి దేవుడు అధ్యక్షతన మంగళ వారం జరిగింది.నాయీబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షే మం కోరుకునేది రాష్ట్రంలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందంటే అది కేవలం ఒక్క టీడీపీయే అని అన్నారు. జగన్ పాలనలో మాటలు తప్పితే చేతల్లో లేవన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, రెడ్డి మణి, కుడుపూడి సత్తిబాబు, కొయ్యల రమణ, కోటిపల్లి చంద్రశేఖర్, కొరిపల్లి నాగేశ్వరరావు, బలగం కిరణ్, కందికొండ అనంత్ పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో ఏఐకేఎంఎస్ మహాసభలు

ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు టాన్యా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 30 : అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 10వ మహాసభలు ఫిబ్రవరి 3, 4 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్నాయని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా అన్నారు. రాజమహేంద్రవరంలోని మావో భవన్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రోజుకు కనీసం 30 మంది వరూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని లెక్కలు చెబుతున్నాయని, వ్యవసాయం సంక్షోభంలో పడిన సమయంలో జరుగుతున్న మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.చిట్టిబాబు, సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ జిల్లా సంయుక్త కార్యదర్శి భీమశంకర్, సీహెచ్ రాజారెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా నాయకులు భాను ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో మోటారు వాహనాల ప్రమాద కేసుల పరిష్కారానికి, బాధితులకు తగు పరిహారం అందజేయడానికి ఇప్పటి నుంచే చర్యలకు ఉపక్రమించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఈ మేరకు వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో ఆమె మంగళవారం సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న మోటారు వాహన ప్రమాద కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. త్వరలో ముందస్తు లోక్ అదాలత్ సమావేశాలను నిర్వహిస్తామన్నారు.

నెల్లిమర్ల అమరవీరులకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30: రాజమహేంద్రవరం ఆర్యాపురం సామిల్లు వర్కర్స్ యూనియన్ ఆఫీసులో మంగళవారం నెల్లిమర్ల అమరవీరులకు నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 30వ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నగర కార్యదర్శి కే.జోజి, డి.శ్రీనివాస్, కె.అప్పలరాజు, కె.లాజర్, కాకుల వెంకటేశ్వర్లు, పెట్ట నరసింహమూర్తి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో పందలపాక విద్యార్థి



విజయవాడలో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న చైతన్యతో గైడ్ టీచర్లు

బిక్కవోలు, జనవరి 30: పందలపాక హైస్కూల్ విద్యార్థి కేఎల్ఎస్ చైతన్య విజయవాడలో జరుగుతున్న సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో మన రాష్ట్రం తరపున పాల్గొన్నాడు. చైతన్య తయారుచేసిన లైఫ్ సేవింగ్ లోకాస్ట్ వెంటిలేటర్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం రావడంతో చైతన్యకు ఈఅవకాశం దక్కింది. మంగళవారం ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి ఈఅంశాన్ని పరిశీలించి చైతన్యను, గైడ్ టీచర్లు జయకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శాంసన్, వీర్రెడ్డిలను అభినందించారని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మల్లిబాబు

దివాన్‌చెరువు, జనవరి 30: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా పోరాడుదామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వంక మల్లిబాబు అన్నారు. దివాన్‌చెరువులో మంగళవారం జరిగిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ కులాలన్నీ కలసి కట్టుగా పయనిద్దామని చెప్పారు. బీసీ కులాలన్నింటినీ ఏకత్రాటి పైకి తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేద్దామన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాజానగరం మండలాధ్యక్షుడిగా సూరంపూడి శ్రీనును నియమించినట్టు మల్లిబాబు ప్రకటించారు. సమావేశంలో నాయ కులు మార్గాని చంటిబాబు, దాసరి శ్రీను, గంగి బ్రహ్మరాజు, భీమన వెంకటేశ్వరరావు గౌడ్, నీలపాలశివ, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కొవ్వూరు, జనవరి 30: మండలంలోని వాడపల్లిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టుచేసి కేసునమోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక బంగారమ్మపేటకు చెందిన షాన నాగమణిని అరెస్టు చేసి ఆమె నుంచి 8 బీరు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్